లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తాండూర్ : మండలంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మాదారం ఎస్సై రాజశేఖర్ అన్నారు. శుక్రవారం ఎంపీఓ సత్యనారాయణతో కలిసి నర్సాపూర్ పంచాయతీలోని గిరిజన గ్రామాలను సందర్శించి ప్రజలకు పలు హెచ్చరికలు చేశారు. ఎస్సై మాట్లాడుతూ భారీ వర్షాల దృష్ట్యా ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వాగులు, వంకలు, చెరువులు, జలాశయాల్లో చేపలు పట్టడానికి వెళ్లకూడదన్నారు. రాబోయే రెండు రోజులు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని, ప్రజలు ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని తెలిపారు. ఉరుములు మెరుపులతో కూడిన వర్ష సూచన ఉన్నందున రైతులు పొలం పనుల వద్ద జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వ ఎమర్జెన్సీ సర్వీసులను ఉపయోగించుకోవాలని తెలిపారు. గ్రామాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూడాలని, దోమలు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్ వాడాలని కార్యదర్శి సాదుల్లకు సూచించారు. ఆయన వెంట ఎఎస్ఐ షేక్ హుస్సేన్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
శనివారం 22 జులై 2023

వైద్యాధికారిని కొనసాగించాలని నిరసన

నవతెలంగాణ - జైనూర్

మండలంలోని ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఉషేగావ్ ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న ప్రభుత్వ వైద్యాధికారి రాజును అదే ఆస్పత్రిలోనే కొనసాగించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. శుక్రవారం భారీ వర్షాలు కురుస్తున్నా కూడా గ్రామస్తులు సుమారుగా 20 మంది ప్లేకార్డులతో ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం నుండి ఏజెన్సీ ప్రాంతమైన ఉషేగావ్ ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారిని ఉషేగావ్ పీహెచ్‌సీ నుండి లింగాపూర్ పీహెచ్‌సీకి బలవంతంగా బదిలీపై చేయడం తగదన్నారు. ఉన్న ఒక్క వైద్యుడిని ఇక్కడి నుండి పంపించడం ఎక్కడి న్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు స్పందిస్తూ జెడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు దృష్టికి తీసుకెళ్లి రాజును యధావిధిగా కొనసాగించేందుకు కృషి చేస్తానని భరోసా కల్పించారు. దీంతో ధర్నా విరమించారు.

మణిపూర్ ఘటన దోషులను కఠినంగా శిక్షించాలి

కాసిపేట : మణిపూర్ ఘటన దోషులను కఠినంగా శిక్షించాలని తుడుందెబ్బ ఆధ్వర్యంలో శుక్రవారం కొండాపూర్ యాప చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి ఆడె జంగు మాట్లాడుతూ రోజురోజుకు దేశంలో బడుగు బలహీన వర్గాలపై దాడులు పెరుగుతుండడం సిగ్గు చేటన్నారు. భారతీయులమని చెప్పుకునే మనం బాధ్యత లేకుండా మహిళల పట్ల ఇలాంటి చర్యలకు పాల్పడడం యావత్ సమాజానికే సిగ్గు చేటన్నారు. ఆదివాసీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. అటవీ ప్రాంతంలో నివసించే ఆదివాసీ గిరిజనులకు దేశంలో రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పెంద్రం హన్మంతు, వెడ్మ కిషన్, కొమ్ముల రాంచందర్, తుడుందెబ్బ కార్యదర్శి కుర్సింగ తిరుపతి, మహిళా నాయకురాలు సెడ్మక రాధ, నాయకులు మోతీరాం, శ్రీనివాస్, భీంరావు, రాందాస్, నవీన్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

మణిపూర్‌లో ఆదివాసీ మహిళల నగ్న ఊరేగింపు మోడీ సర్కారు దుర్మార్గపు చర్య అని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో బెల్లంపల్లిలో మున్సిపల్ ఆఫీస్ చౌరస్తా వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ మూడు నెలల నుండి మణిపూర్‌లో మైతి, కూకి జాతుల మధ్య ఘర్షణను నిలువరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలిపారు. కుకి తెగకు చెందిన ముగ్గురు మహిళలను బహిరంగ ప్రదేశాలలో నగ్నంగా ఊరేగించి సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారని, నిందితులపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మణిపూర్ సీఎం బీరన్‌సింగ్, పీఎం నరేంద్ర మోడీ తక్షణమే రాజీనామా చేసి కుకి జాతి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆసిఫాబాద్ : మణిపూర్‌లో మహిళలను వివస్త్రను చేసి రోడ్డుపై ఊరేగించిన ఘటనను ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య ఖండించాడు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభ్య సమాజం సిగ్గుపడేలా మణిపూర్‌లో సంఘటన చోటు చేసుకుందన్నారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మెజార్టీ ప్రజల ద్వారా మైనార్టీ తెగలకు నష్టం కలిగించే విధంగా రాష్ట్ర ప్రభుత్వ చర్యలు ఉన్నాయని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. సంఘటనను మానవతావాదులు, స్వచ్ఛంద సంస్థలు, ఎన్నారైలు, సినీ ప్రముఖులు ప్రతి ఒక్కరు ఖండించాలన్నారు.

బోదకాల వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

ఆసిఫాబాద్ : బోదకాల వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ బొర్కడే హేమంత్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఎండిఎ మాస్ డ్రగ్ నిర్వహణకు సంబంధించిన కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 10 నుండి డిఈసి మాత్రలు రెండు సంవత్సరాల పైబడిన వారికి అందజేస్తామన్నారు. వీటి ద్వారా బోదకాలు నిర్మూలన సాధ్యమవుతుందని, సిబ్బంది ప్రతి ఒక్కరికి మాత్రలు వేసే విధంగా చూడాలన్నారు. మాత్రలు వేసిన వారి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. అన్ని రకాల విద్యాసంస్థల్లో మాత్రలు అందజేయాలన్నారు. నిర్దేశించిన విధానాల ప్రకారం 2 నుంచి 5 సంవత్సరాలు వారికి ఒక మాత్ర, 6 నుండి 14 సంవత్సరాల వారికి రెండు మాత్రలు, 15 నుండి 19 సంవత్సరాలు ఆపైన వారికి మూడు మాత్రలు ఇవ్వాలని తెలిపారు. వీటితోపాటు ఒక ఆల్బెండజోల్ మాత్ర కూడా అందించాలన్నారు. రెండు సంవత్సరాల లోపు పిల్లలకు, గర్భిణులకు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు, గుండె జబ్బులు, కిడ్నీ, ఊపిరితిత్తుల జబ్బులు ఉన్నవారికి మాత్రలు ఇవ్వకూడదని తెలిపారు. సిబ్బంది శక్తివంచన లేకుండా కృషి చేసినప్పుడే బోదకాల వ్యాధి నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రీవాల్, అదనపు కలెక్టర్ రాజేశం, జిల్లా వైద్యాధికారి రామకృష్ణ, జిల్లా డిప్యూటీ వైద్యాధికారి సుధాకర్ నాయక్ పాల్గొన్నారు.

ఏకధాటి వాన..జనం హైరానా..!

- ప్రమాదకరంగా ప్రవహిస్తున్న నదులు, వాగులు
- ప్రాజెక్టుల గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల
- నదీ పరివాహక ప్రాంతాల్లో నీట మునిగిన పంటలు
- ధన్నూరు(బి)లో కుంటలో పడి వ్యక్తి మృతి
- లోతట్టు ప్రాంతాల్లో ఇండ్లలోకి చేరిన వరద
- బాహ్య ప్రపంచానికి దూరమైన అనేక పల్లెలు

ఎడతెరిపి లేని వర్షం..ఉమ్మడి జిల్లా జనజీవనాన్ని అతలాకుతలం చేస్తోంది. నాలుగు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో జిల్లా జల విలయాన్ని తలపిస్తోంది. జిల్లాలోని నదులు, వాగులు, వంకలు ప్రమాదకరంగా ప్రవహించడంతో అనేక గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. పలు ప్రాజెక్టుల్లోకి భారీగా వరద నీరు రావడంతో గేట్లు ఎత్తివేసి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. కడెం ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు రావడంతో 14గేట్లు ఎత్తివేశారు. మరో నాలుగు గేట్లకు మరమ్మతులు చేయకపోవడంతో మొరాయిస్తున్నాయి. నదులు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో వాటి పరివాహక ప్రాంతాల్లోని పంటలు నీట మునిగాయి. బోథ్ మండలంలోని ధన్నూరు(బి)కి చెందిన జుపాక రాజేశ్వర్ నీటి కుంట దాటుతూ మృతి చెందారు. కౌటాల మండలంలో భారీ వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాల్లోని ఇండ్లలోకి వరద నీరు చేరడంతో నివాసితులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. పలు చోట్ల వాగులపై వంతెనలు లేకపోవడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి.

నవతెలంగాణ-
ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఏకధాటి వర్షాలు ఉమ్మడి జిల్లాను వణికిస్తున్నాయి. నిన్నటి వరకు కురిసిన వర్షాలతో పంటలకు మేలు జరుగుతుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేయగా ఏకధాటిగా కురుస్తుండటంతో వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లాలో సాధారణ కంటే అధిక వర్షపాతం నమోదు కావడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ పరిస్థితిని ముందే గమనించిన ప్రభుత్వం రెండు రోజుల పాటు విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించిన సంగతి తెలిసిందే. మరోపక్క ఇప్పటికే ప్రాజెక్టులు నిండిపోగా.. వరద నీరు భారీగా వచ్చి చేరుతుండటంతో గేట్లు ఎత్తి కిందకు నీటిని వదిలేస్తున్నారు. దాదాపు మెజార్టీ ప్రాజెక్టుల్లో ఇన్‌ఫ్లో ఎంత ఉందో..అవుట్‌ఫ్లో కూడా అదే స్థాయిలో ఉండటం గమనార్హం. నిర్మల్ జిల్లాలో కడెం ప్రాజెక్టుకు భారీ స్థాయిలో వరద నీరు రావడంతో అధికారులు 14గేట్లు ఎత్తివేశారు. మరో నాలుగు గేట్లు మొరాయిస్తున్నాయి. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 82వేల క్యూసెక్కులు కాగా.. అవుట్ ఫ్లో లక్షా 960క్యూసెక్కుల నీటిని కిందకు వదులుతున్నారు. మిగితా సాత్నాల, గడ్డెన్నవాగు, ఎల్లంపల్లి తదితర ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేసి నీటిని విడిచిపెడుతున్నారు. జిల్లా సరిహద్దులోని గోదావరి, ప్రాణహిత, పెన్‌గంగా, వార్ధా నదులు ప్రమాదకరంగా ప్రవహిస్తుండటంతో సమీప గ్రామాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. మంచిర్యాల వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఒడ్డున నిర్మించిన మాతాశిశుసంరక్షణ కేంద్రాన్ని అధికారులు ఖాళీ చేయిస్తున్నారు.


పరవళ్లు తొక్కుతున్న కడెం ప్రాజెక్టు

పంటలన్నీ వర్షార్పణం..!

నదులు, వాగులు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో వాటి పరివాహక ప్రాంతాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. వర్షం ఏకధాటిగా కురవడం.. మిగతా ప్రాంతాల్లో కూడా నీరు నిల్వ ఉంటోంది. పత్తి, సోయా తదితర పంటల మొలకలు చిన్నగా ఉండటం నీరు నిలిచి ఉండటంతో జవుకు పట్టే పరిస్థితి ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీరు నిల్వ ఉన్న పంట పొలాల్లో మొక్కలు ఉండిపోయే ప్రమాదం ఉంటుందని చెబుతున్నారు. తెరిపి లేకుండా కురుస్తుండటంతో అన్నదాతలు పొలాల్లోకి వెళ్లి నీటిని బయటకు వదిలేయలేకపోతున్నారు. వారం రోజుల క్రితం వర్షం లేదని మదనపడిన రైతులకు తాజాగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు బాధలు తప్పడం లేదు.

నిలిచిన రాకపోకలు

ఉమ్మడి జిల్లాలో ఎక్కువగా అటవీ ప్రాంతాలు ఉండటం.. వాటి మధ్యలో వాగులు, వంకలు అదే స్థాయిలో ఉండటంతో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అనేక చోట్ల వాగులపై వంతెనలు లేకపోవడం..కొన్నిచోట్ల కల్వర్టులు చిన్నగా ఉండటంతో వాటిపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. దీంతో అనేక పల్లెలకు రాకపోకలు నిలిచిపోయాయి. బేల మండలంలోని కాప్రి సమీపంలో కల్వర్టుపై నుంచి నీరు పారడంతో అటువైపు గ్రామాలైన సాంగిడి, కొత్తసాంగిడి, బెదోడ, మధుర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇంద్రవెల్లి మండలంలో జైత్రాంతాండ, చిత్తభట్ట, బండగూడ గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి. ఇదే మండలంలోని గిన్నెర పంచాయతీ పరిధి తోయగూడ గ్రామానికి వెళ్లేందుకు మధ్యలో వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో అంబులెన్సు కూడా చేరుకోలేదు. దీంతో ఆ గ్రామానికి చెందిన ఓ ఆదివాసీ మహిళ కొడప రాంబాయి మృతి చెందడంతో ఎడ్లబండ్ల సాయంతో మృతదేహాన్ని వాగు దాటించాల్సిన పరిస్థితి తలెత్తింది. కొన్ని గ్రామాలకు వెళ్లే అనుసంధాన రోడ్లు ఛిద్రమయ్యాయి. ఇలా అనేక గ్రామాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మరో రెండు వర్షం ఇలాగే కొనసాగితే పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.


బోథ్ మండలంలో కోతకు గురైన రహదారి


కౌటాల మండలంలో ఇండ్ల ముందు నిలిచిన వర్షం నీరు

అడ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అడ ప్రాజెక్టు నిండుకుండను తలపించడంతో అధికారులు గేట్లు ఎత్తి నీటిని కిందికి వదులుతున్నారు. దీంతో దిగువ ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దిగువ ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. శుక్రవారం సాయంత్రం వరకు 2, 3, 4, 5, 6, 7 నెంబరు గల గేట్లను 0.80 మీటర్లు ఎత్తి 9738 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటిమట్టం 243 మీటర్లు కాగా సాయంత్రం వరకు 237.550 మీటర్లకు చేరుకుంది. ప్రాజెక్టు సామర్థ్యం 10.393 టీఎంసీలు కాగా ఇప్పటివరకు 5.688 టిఎంసిలకు చేరుకుంది. ఇన్‌ఫ్లో 7500 క్యూసెక్కులుగా ఉంది. దీంతో 6 గేట్లు ఎత్తి 9738 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు.

జిల్లాలో వర్షపాతం వివరాలు

జిల్లాలో శుక్రవారం కుండపోత వర్షం కురిసింది. అధికారుల లెక్కల ప్రకారం గురువారం ఉదయం నుండి శుక్రవారం ఉదయం వరకు జిల్లాలో సగటు 41.8 మిల్లీ మీటర్ల వర్షపాతం కురిసింది. జైనూర్‌లో 11 మి.మీ. సిర్పూర్(యు)లో 10.2, లింగాపూర్‌లో 13.4, తిర్యాణిలో30, రెబ్బెనలో 58.6, ఆసిఫాబాద్‌లో 23, కెరమెరిలో 13.4, వాంకిడిలో 26.2, కాగజ్‌నగర్‌లో 47.2, సిర్పూర్(టి)లో 36.2, కౌటాలలో 96.2, చింతలమానేపల్లిలో 80, బెజ్జూర్‌లో 23.2, పెంచికల్‌పేటలో 57.4, దహెగాంలో 102.4 మి.మీటర్ల వర్షం కురిసింది.

పొంగిన వాగులు నిలిచిన రాకపోకలు

వర్షంతో పాటు ప్రాజెక్టుల గేట్లు ఎత్తడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గుండి గ్రామానికి వెళ్లే రహదారిలో వాగు ఉప్పొంగడంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బెండ్ల తెప్పలపై గ్రామస్తులు ప్రయాణం కొనసాగిస్తున్నారు. గతంలో ప్రమాదాలు జరిగినప్పటికీ తప్పని పరిస్థితుల్లో ప్రయాణం చేయాల్సి వస్తోందని, బ్రిడ్జి పూర్తి చేయకపోవడమే ఈ దుస్థితికి కారణమైందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాంకిడి మండలంలో లంజన్ వీర గ్రామానికి వెళ్లే దారిలో రహదారిపై ఉన్న ఒర్రె పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. జిల్లా కేంద్రం నుండి తిర్యాణి వెళ్లే రహదారిలో డోర్లి వద్ద వాగు పొంగడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలోని అప్పపెల్లికి వెళ్లే దారిలో ఒర్రెపై వేసిన తాత్కాలిక రహదారి కొట్టుకపోవడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రహపెల్లిలో ఇండ్లలోకి వరద నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



కాసిపేట : మండలంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతుండగా చెరువుల్లోకి వరద నీరు భారీగా చేరుతోంది. వర్షం కారణంగా జనజీవనం స్తంభించింది. గ్రామాల్లో వర్షాల కారణంగా జరిగే ప్రమాదాలను వివరిస్తూ జాగ్రత్తలు పాటించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసులు సూచనలు చేశారు.

దహెగాం : మండలంలో రెండు రోజులుగా ఎడతెరిపి లేని భారీ వర్షం కురుస్తోంది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో పంట పొలాల్లో వర్షపు నీరు చేరి పొలాలు మునిగిపోయాయి. భారీ వర్షాల కారణంగా పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

చింతలమానేపల్లి : మూడు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి లోతట్టు ఇళ్లలో నీరు చేరింది. అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో స్థానికుల సాయంతో ఆయిల్ ఇంజన్ ద్వారా నీళ్లని తోడేశారు. దింద, కేతిని వాగులు నిండు కుండల్లా మారడంతో నాలుగు రోజుల నుండి దింద గ్రామస్తులు బహ్య ప్రపంచానికి దూరమయ్యారు. బాబాసాగర్, నాయకపుగూడ, రవీంద్ర గర్-1, బాలాజీ అనుకోడ, గూడెం, శివపెల్లి గ్రామాల మధ్య వాగులు పొంగిపొర్లుతున్నాయి.

వాంకిడి : మండలంలో రెండు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో పాటగూడ, ఇంద్రవెల్లి, తమేళ, ఎనగొంది, ఎనోళి, రోహినిగూడ తదితర గ్రామాల ప్రజలు వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహించడంతో వాటిని దాటిరావడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమేళ గ్రామంలో ప్రధాన రహదారి పూర్తిగా బురదమయం కావడంతో కాలినడకన కూడా రావడానికి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

సీఆర్ఆర్‌కు కన్నీటి వీడ్కోలు

- భౌతిక కాయానికి నాయకులు, ప్రముఖుల నివాళులు
- పట్టణ ప్రధాన వీధుల గుండా సాగిన అంతిమయాత్ర
- భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, అభిమానులు
- అధికారిక లాంఛనాలతో ముగిసిన అంత్యక్రియలు


అంత్యక్రియలకు హాజరైన ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, కలెక్టర్, ఎస్పీ

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌టౌన్

మాజీ మంత్రి, రాజకీయ కురవృద్ధుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిల్కూరి రాంచంద్రారెడ్డికి జిల్లావాసులు కన్నీటితో వీడ్కోలు పలికారు. గురువారం రాత్రి ఆయన పార్థివదేహం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసానికి చేరుకుంది. శుక్రవారం ఉదయం 6గంటల 11గంటల వరకు ప్రజల సందర్శనార్థం ఉంచారు. ఆదిలాబాద్ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు చివరి చూపు కోసం తరలివచ్చారు. ఆయన భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా వివిధ ప్రాంతాల నుంచి వివిధ పార్టీల నాయకులు, పార్టీ శ్రేణులు, అభిమానులు తండోపతండాలుగా తరలివచ్చి పార్థివదేహానికి నివాళులర్పించారు. సీఆర్ఆర్ మద్దతుతో ఎదిగిన నాయకులు, పార్టీ శ్రేణులు ఆయన చేసిన మేలును గుర్తుచేసుకొని కన్నీటి పర్యాంతమయ్యారు.

పురవీధుల గుండా సాగిన అంతిమయాత్ర

రాంచంద్రారెడ్డి అంతిమయాత్ర పట్టణ పుర వీధుల గుండా సాగింది. వేలాది మంది అభిమానుల మధ్య శాంతినగర్‌లోని ఆయన నివాసం నుంచి ప్రారంభమైన ఈ యాత్ర వినాయక్‌చౌక్, అశోక్‌రోడ్, గాంధీచౌక్, అంబేద్కర్‌చౌక్, శివాజీచౌక్ గుండా తిర్పెల్లి స్మశానవాటిక వరకు సాగింది. దారిపొడవునా సీఆర్ఆర్ అమర్‌రహే అంటూ కార్యకర్తలు నినదించారు. పట్టణ శివారులోని తిర్పెల్లి స్మశానవాటికలో పోలీసుల గౌరవ వందనం మధ్య అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. సీఆర్ఆర్ మేనల్లుడు అల్లూరి సంజీవరెడ్డి ఆయన చితికి నిప్పంటించారు.


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మధుయాష్కి, ఐకేరెడ్డి, జోగు రామన్న తదితరులు

ప్రజాప్రతినిధులు, నాయకుల నివాళులు

పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు జోగు రామన్న, నడిపెల్లి దివాకర్‌రావు, రాథోడ్ బాపురావు, డీసీసీబీ ఛైర్మెన్ అడ్డి భోజారెడ్డి, రాష్ట్ర నీటిపారుదలశాఖ కార్పొరేషన్ ఛైర్మెన్ వేణుగోపాలచారి, జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీలు హనుమంతరావు, మధుయాష్కిగౌడ్, మున్సిపల్ ఛైర్మెన్ జోగు ప్రేమేందర్, మాజీ డెయిరీ ఛైర్మెన్ లోక భూమారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డి, మహారాష్ట్ర మాజీ మంత్రి వామన్ కాసావార్, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు సీఆర్ఆర్ పార్థివ దేహానికి నివాళులర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు.

దోచుకోవడం దాచుకోవడం తప్ప అభివృద్ధి లేదు

కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ రాజారమేష్

నవతెలంగాణ-జైపూర్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దోచుకోవడం దాచుకోడానికి తప్ప అభివృద్ధికి పాటుపడటం లేదని కాంగ్రెస్ నాయకులు డాక్టర్ రాజారమేష్ విమర్శించారు. టేకుమట్ల మీదుగా శివ్వారం వైపు రాకపోకలు నిల్చిపోయినట్లు తెలుసుకుని కాంగ్రెస్ నాయకులతో కలిసి టేకుమట్ల వాగు, పెగడపల్లి ఈదుల వాగులను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాల కారణంగా మండల పరిధిలో గల పెగడపల్లి, టేకుమట్ల శివారుల్లో వాగులు పొంగిపొర్లుతున్నాయని, ఈ వాగులపై పటిష్టమైన హైలెవల్ వంతెనలు నిర్మాంచాల్సి ఉందని తెలిపారు. గత సంవత్సరం కూడా ఇదే విధంగా కురిసిన వర్షాలతో టేకుమట్ల శివారులో రసూల్‌పల్లి పెద్ద వాగు ఉప్పొంగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడిందని, నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే వంతెన నిర్మాణంపై దృష్టి సారించకపోవడం బాధాకరమని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు నియోజకవర్గ ప్రజలు బుద్ధి చెప్పనున్నారని, కాంగ్రెస్ అధికారంలో రావడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బెజ్జాల మాజీ సర్పంచ్ ప్రకాష్, విద్యాసాగర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు కల్కి రమేష్, జైపూర్ గ్రామ కమిటీ అధ్యక్షులు అరిగల శ్రీనివాస్‌గౌడ్, టేకుమట్ల గ్రామానికి చెందిన ప్రశాంత్, లింగస్వామి, భీమారం మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకులు గుడిమల్ల వెంకన్న, శేఖర్‌రెడ్డి, బొందయ్య, రాజు పాల్గొన్నారు.



ఎంపీడీఓ సత్యనారాయణ బాధ్యతలు

నవతెలంగాణ-చింతలమానేపల్లి

కొత్తగా వచ్చిన ఎంపీడీఓ కె.సత్యనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కెరిమెరి మండలం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఉన్న సుధాకర్‌రెడ్డిని బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. తహసీల్దార్ మస్కూర్ అలీ, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

పట్టణానికి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

రామకష్టాపూర్ : పట్టణంలోని ఇందిరానగర్‌లో కాంగ్రెస్ యువజన నాయకులు చిలువేరి లక్ష్మణ్ పుత్రుని 21రోజు కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎఐసిసి సెక్రటరీ, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఆయనను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు నూకల రమేష్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పిన్నింటి రఘునాథ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు పల్లె రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గాంధే రాంచందర్, డిసిసి ఉపాధ్యక్షుడు పుల్లూరి లక్ష్మణ్, పట్టణ మైనారిటీ అధ్యక్షులు లాడెన్ అనిరుద్, రెవెళ్లి శ్రీకాంత్ పాల్గొన్నారు.

మహిళల భద్రతకు షీ టీం

తాండూర్: మహిళల భద్రతకు షీ టీంలు ఎల్లవేళల కృషి చేస్తున్నాయని షీ టీం ఎస్సై ఓబులమ్మ తెలిపారు. ఆమె శుక్రవారం తాండూర్ కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినులకు షీటీంపై అవగాహన కల్పించారు. మహిళల మాన ప్రాణ రక్షణకు షీటీంలు కృషి చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ కవిత, సిఆర్టి మనీషా, తిరుమల షీ టీం సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-దిలావర్‌పూర్



విద్యార్థులు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రాజేందర్ అన్నారు. శుక్రవారం ఆర్‌బీఎస్‌కే కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ ధన్ రాజ్ ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యారోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి, రక్తహీనత, సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. పాఠశాలలో వంటశాల, తాగునీటి సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థుల పూర్తి ఆరోగ్య పర్యవేక్షణ కొరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఓ అపర్ణ, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్, ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ నాగేశ్వర్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం పరిశీలన

నవతెలంగాణ-నిర్మల్



జిల్లా కేంద్రంలోని పాత తహసీల్దార్ కార్యాలయం ప్రాంతంలో సమీకృత మార్కెట్ ఏర్పాటు చేయనున్న సందర్భంగా శుక్రవారం మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ కార్యాలయ ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యాలయం తొలగించే ప్రక్రియను తగు జాగ్రత్తలతో చేయాలని సూచించారు. మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి కృషి, సహకారంతో, నూతన సమీకృత మార్కెట్ భవన నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. నిర్మల్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుంటున్నామని అన్నారు. చైర్మెన్ వెంట ఏఈ హరిభూవన్, సంబంధిత మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

బీఈడీ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



నవతెలంగాణ-ఉట్నూర్

ఐటీడీఏ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో కేబి కాంప్లెక్స్‌లో నడుస్తున్న బీఈడీ కళాశాలలో నూతన కంప్యూటర్ లాబ్‌ను శుక్రవారం ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్ పాయ్ ప్రారంభించారు. అక్కడ ఉన్న లైబ్రరీను పరిశీలించారు. పీఓ రాకతో కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు స్వాగతం పలికారు. అనంతరం పీఓను సన్మానించారు. అంతకుముందు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పీఓ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు ప్రొఫెషనల్ కోర్సులలో రాణించేందుకు ఐటీడీఏ ఆధ్వర్యంలో బీఈడీ కళాశాలను ఏర్పాటు చేశామని అన్నారు. ప్రవేశ పరీక్షలతో డిగ్రీలోని మార్కుల ఆధారంగా గిరిజన విద్యార్థులను ప్రవేశం కల్పించడం జరుగుతుందన్నారు. ఛాత్రోపాధ్యాయులకు అవసరం అయ్యే కంప్యూటర్ లాబ్‌ను ఏర్పాటు వల్ల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. ఇలాంటి అవకాశాలను గిరిజన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అంతకుముందు ఐటీడీఏ పీఓ ఛాంబర్‌లో అంగవైకల్యం గల విద్యార్థులకి స్వీకారామ్ ప్రత్యేక కళాశాలలో చదవడానికి కావాల్సిన ఫీజు చెక్కును పీఓ అందజేశారు. భవిష్యత్తులో మరింత ఉన్నత చదువులు చదవాలని విద్యారులకు ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ డీడీ దిలీప్ కుమార్, ఏఓ రాంబాబు, విద్యార్థులు కుమ్ర చిన్న, సోయం సందీప్, శ్రీకాంత్, బీఈడీ కళాశాల అధ్యాపకులు ఉన్నారు.

ఆనకట్టపై అనుమతి నిషేధం

- ప్రమాదపు సూచిక బోర్డును ఏర్పాటు చేసిన పోలీసులు



నవతెలంగాణ-ఖానాపూర్ రూరల్

ఇటీవల సదర్మాట్ ఆనకట్టలో యువకుడు ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన నేపథ్యంలో స్థానిక పోలీసులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. అందులో భాగంగా శుక్రవారం ఎస్సై శంకర్ ప్రమాదక సూచిక బోర్డులను ఏర్పాటు చేయడంతో పాటు ఆనకట్టపై పర్యాటకులకు నిషేధిత హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. అలాగే ఆనకట్టపై సందర్శకులు వెళ్లకుండా ఇనుపకంచెను సైతం ఏర్పాటు చేశారు. పర్యాటకులు సందర్శనార్థం సదర్మాట్ వచ్చిన క్రమంలో ఆనకట్టపై వెళ్లకూడదని హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా శిథిలావస్థకు చేరిన నివాస గృహాల్లో ప్రజలు ఉండకూడదని ఎస్సై శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్తు పరికరాలను తడి చేతులతో తాకవద్దని అన్నారు. జలపాతాల వద్ద యువకులు సరదాలు తీర్చుకునే క్రమంలో జాగ్రత్తలు పాటించాలని ఎస్సై పేర్కొన్నారు. గోదావరి నది, సదర్‌మాట్ ఆనకట్టలోకి ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున అటు వైపు ప్రజలు వెళ్లకుండా ఉండి జాగ్రత్తలు పాటించాలని కోరారు.

పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ ఆకస్మిక తనిఖీ

పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది పనితీరు సీఐ రవీందర్ నాయక్, ఎస్సై శంకర్‌లను అడిగి తెలుసుకున్నారు. పనితీరు పట్ల హర్షం వ్యక్తం చేశారు. సాధారణ తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్ తనిఖీ చేసినట్లు తెలిపారు.

దుబార్‌పేట్ గ్రామస్తుల రాస్తారోకో



నవతెలంగాణ-ఇచ్చోడ

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఇండ్లలోకి వర్షపు నీరు వస్తున్నాయని శుక్రవారం మండలంలోని దుబార్‌పేట్ గ్రామస్తులు జాతీయ రహదారిపై 4 గంటలు పాటు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ హైవే నిర్మాణం చేపట్టిన నుంచి ప్రతి సంవత్సరం వర్షాకాలంలో ఇండ్లలోకి నీరు రావడంతో నిత్యవసర సరుకులైన బియ్యం, పప్పులు, విలువైన వస్తువులు, కాగితలు, తడిసి ముద్దయినట్లు తెలిపారు. ఆదివాసీ ప్రజలుకు హైవే రహదారి వల్ల తమ ఇండ్లలోకి నీరు చేరుతుందని అన్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. గత తొమ్మిది సంవత్సరాలుగా ఇలాగే ఇబ్బందులు పడుతున్న ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు నాలుగు గంటల పాటు జాతీయ రహదారి దిగ్బంధం చేయడం వల్ల భారీగా కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయాయి. స్పందించిన ఆర్డీఓ, నేషనల్ హైవే అధికారుల స్థలానికి వచ్చి గ్రామస్తులు మాట్లాడి ఖచ్చితమైన హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు.

ఈవీఏంలపై అవగాహన

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మండలంలోని నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామంలో డిప్యూటీ తహసీల్దార్ గంగాధర్ ఆధ్వర్యంలో ఓటర్లకు ఈవీఎం, వీవీప్యాట్‌లపై అవగాహన కల్పించారు. ఓటు వేసే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శ్రీవిద్య, పంచాయతీ కార్యదర్శి సుధాకర్, రెవిన్యూ సిబ్బంది, పోలీస్ సిబ్బంది నారాయణరెడ్డి, సంజయ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటన దేశానికి సిగ్గు చేటు

- అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) జిల్లా అధ్యక్షురాలు నైతం సుజాత



నిర్మల్

నవతెలంగాణ-నిర్మల్

మణిపూర్‌లో మహిళలపై జరిగిన లైంగికదాడి, హత్య సిగ్గుచేటని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు నైతం సుజాత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని వైఎస్సార్ కాలనీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలని అన్నారు. ఈ ఘటనపై కేంద్రం నైతిక బాధ్యత వహించి ఆదివాసీలకు న్యాయం చేయాలని, దాడులను వెంటనే నిలిపివేయకుంటే దేశ వ్యాప్తంగా ఆందోళన ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో గంగామణి, పూజ, గంగా, జ్యోతి, లక్ష్మి పాల్గొన్నారు.

ఉట్నూర్ : మణిపూర్‌లో గిరిజన మహిళలపై జరిగిన అత్యాచారం, హత్యల ఘటన దేశానికి సిగ్గు చేటని దళిత జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు, అంబేద్కర్ అసోసియేషన్ డివిజన్ ఉపాధ్యక్షులు కాంబ్లె ప్రజ్ఞశీల్, ఆదివాసీ మహిళ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి పెందుర్ పుష్పరాణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో అంబేద్కర్ చౌక్‌లో నోటికి నల్లని గుడ్డలను కట్టుకుని వర్షంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్ ఘటన నిందితులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో మెజారిటీ వర్గమైన మైతేయిన్‌లు, మైనార్టీలైన కుకీ గిరిజనులకు మధ్య హింస పేట్రేగిన మే 4న మైతేయిన్‌లు అత్యంత పాశవికంగా కుకీ మహిళలను నగ్నంగా ఊరేగించి, సామూహిక అత్యాచారం, హత్య చేయడం దారుణమని అన్నారు. సాయుధులైన యువకులు దారిపొడవున వారి మర్మావయవాలను తడుముతూ పైశాచికానందం పొందడం చాలా సిగ్గు చేటన్నారు. ఘటన జరిగి ఇన్ని రోజులు అవుతున్న దోషులను పట్టుకోవడంలో అక్కడి రాష్ట్ర ప్రభుత్వంతో పాటుగా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా వ్యవహించడం విడ్డురంగా ఉందన్నారు. అనునిత్యం మహిళలు, బడుగు బలహీన ప్రజలపై దాడులు పెరుగుతూనే ఉన్నాయని అన్నారు. పౌర సమాజం ఇలాంటి ఘటనలను ఖండించాలని, మణిపూర్ ఘటనకు మణిపూర్ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వానిదే పూర్తి బాధ్యతని విమర్శించారు. నిందితులను వెంటనే పట్టుకొని ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దళిత, ఆదివాసీ, గిరిజన, మైనారిటీ సంఘాల ఆధ్వర్యంలో హైవేలపై ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ కొల్లూరి స్వామి, ఆదివాసీ విద్యార్థి సంఘ నాయకులు ఆత్రం ఉపేందర్, నేతకాని సంఘ జిల్లా నాయకులు జాడి వెంకటేష్, మైనారిటీ నాయకులు జుబెర్‌ఖాన్, దళిత సీనియర్ నాయకులు జాడి లక్ష్మీపతి, వివిధ సంఘాల నాయకులు కళ్యాణ్ రాథోడ్, వాసు, సుశీల్, సోహెల్, భూమన్న, సత్తన్న, భుజంగ్ రావ్, దేవేందర్, హన్మంతు ఉన్నారు.

నిర్మల్ : మణిపూర్ అల్లర్లపై నరేంద్ర మోడీ, అమిత్ షానే పూర్తి బాధ్యత వహించాలని, అమ్మాయిలని నగ్నంగా ఊరేగించి గ్యాంగ్ రేప్ చేసి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలనీ పీఓడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి కట్ల లక్ష్మి అన్నారు. శుక్రవారం ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలో భగత్ సింగ్ భవన్‌లో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మణిపూర్‌లో జరుగుతున్న దారుణాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయని అన్నారు. కుకీ తెగకు చెందిన ముగ్గురు గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి, సామూహికంగా లైంగికదాడికి పాల్పడి, వారిలో ఇద్దరిని హతమార్చిన ఉదాంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందన్నారు. ఈ దారుణం మణిపూర్ రాజధాని ఇంఫాల్‌కు 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న నాంగ్ పోక్ సెక్మాయ్ సమీపంలో జరిగిందని, ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందన్నారు. ప్రభుత్వానికి తెలిసినప్పటికీ, ఈ ఘటనపై ఎలాంటి స్పందన లేనటువంటి దుస్థితి నెలకొందన్నారు. దేశంలో అమ్మాయిలకు రక్షణ కరువైందని అన్నారు. లైంగికదాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని, మణిపూర్ అల్లర్లపై నరేంద్ర మోడీ, అమిత్‌షానే పూర్తి బాధ్యత వహించాలని, లేనిపక్షంలో ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు బంతి ముత్తవ్వ రాణి, గంగామణి, రాజమణి పాల్గొన్నారు.

ఖానాపూర్ : నగ్నంగా ఊరేగించి గ్యాంగ్ రేప్ హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలనీ లంబాడాకుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు బాణావత్ గోవింద నాయక్, బహుజన ముక్తి పార్టీ జిల్లా అధ్యక్షులు కాంబ్లే సూర్యకాంత్ లు అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మణిపూర్ రాజధాని ఇన్‌పాల్‌కు 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న నాంగ్ పోక్ సెక్మయ్ సమీపంలో మే 4న ఈ దారుణమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చిందని అన్నారు. పట్టపగలు కుకి తెగకు చెందిన ముగ్గురు గిరిజన మహిళలను నగ్నంగా ఊరేగించి సమూహిక అత్యాచారానికి పాల్పడిన వారిలో ఇద్దరినీ హతమార్చిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. ఈ ఘటనను ప్రజలు ప్రజాస్వామిక వాదులు మేధావులు, కవులు, మహిళలు ఖండించాలని విజ్ఞప్తి చేశారు.



ఉట్నూర్



నిర్మల్

భారీ వర్షాల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

- 24 గంటలు పోలీస్ సిబ్బంది అందుబాటులో ఉండాలి
- నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

భారీ వర్షాల దృష్ట్యా ప్రతిఒక పోలీస్ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ డి ఉదయ్ కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ పట్టణంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రానున్న 48 గంటలు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు ఉన్నందున ప్రతి ఒక పోలీసు అధికారి అప్రమత్తంగా ఉండి అత్యవసర సమయంలో అతి త్వరగా స్పందించి సంఘటన స్థలాలకు చేరుకునే విధంగా ఉండాలని సూచించారు. వర్షాల దృష్ట్యా వాగులు పొంగిపొర్లడం సర్వసాధారణం లోతట్టు ప్రాంతాల ప్రజలకు అప్రమత్తంగా ఉంచి అవగాహన కల్పించాలని, లోవర్ బ్రిడ్జిలు, బ్రిడ్జిలపై నీటితో పొంగుతున్న వాటిలోకి ప్రజలు దాటకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా నూతనంగా జిల్లాకు వచ్చిన పోలీసు సిబ్బందికి తమకు కేటాయించిన మండలంలోని ప్రాంతాలపై పూర్తి అవగాహనను కలిగి ఉండే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పోలీస్ స్టేషన్‌కి వచ్చే ప్రతి ఒక్క ఫిర్యాదుదారు ఫిర్యాదును రిసెప్షన్ సెంటర్‌లో నమోదు చేయాలని తెలిపారు. నమోదు చేయబడిన కేసులను దర్యాప్తు పూర్తిచేసి న్యాయస్థానాలలో చార్జిషీట్ దాఖలు చేయాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా నేరాలను అరికట్టాలంటే ఎక్కువగా కేసులు నమోదు చేసి, త్వరితగలిగిన వాటిని దర్యాప్తు పూర్తిచేసే చార్జిషీట్ దాఖలు చేసినప్పుడే నేరాలు తగ్గుముఖం పడతాయని తెలిపారు. అధునాతన సాంకేతికతను విరివిగా వినియోగించుకొని నేరస్తులను పట్టుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ పరిపాలన ఎస్ శ్రీనివాసరావు, డీఎస్పీ వి.ఉమేందర్, పోతారం శ్రీనివాస్, జిల్లా ఇన్స్‌పెక్టర్లు, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు, ఎస్సైలు, డీసీఆర్బి, స్పెషల్ బ్రాంచ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులను గౌరవించాలి

- డీఎస్పీ గంగారెడ్డి



నవతెలంగాణ-దస్తురాబాద్

పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదుదారులను పోలీసులు గౌరవించాలని డీఎస్పీ గంగారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ని డీఎస్పీ సందర్శించి పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. మొదటిసారి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన డీఎస్పీకి పుష్ప గుచ్చంతో ఎస్సై ప్రభాకర్‌రెడ్డి ఆహ్వానించారు. పోలీస్ స్టేషన్‌లో పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షించాలని కోరారు. పోలీస్ స్టేషన్‌కి వచ్చే ఫిర్యాదు దారులకు తగిన మర్యాద ఇవ్వాలని అన్నారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించని వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మండలంలోని యువకులకు రోడ్డు భద్రత నియమాలపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్సై విధుల పట్ల డీఎస్పీ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ రవీందర్ నాయక్, పోలీస్ సిబ్బంది లక్ష్మణ్, శ్రావణ్, సాజిత్, రవి, రజిత, కళ్యాణి, ప్రియాంక పాల్గొన్నారు.

ముగిసిన ఆర్టీసీ డ్రైవర్ల శిక్షణ తరగతులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్టీసీ ఆర్‌ఎం జానీరెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని డిపోలలో పనిచేస్తున్న ఆర్టీసీ డ్రైవర్లు, అద్దె బస్సు డ్రైవర్లకు చోళ ఎంఎస్ బృందం ఆధ్వర్యంలో 15 రోజుల పాటు శిక్షణ తరగతులు ఆదిలాబాద్ ఆర్టీసీ డిపోలో నిర్వహించారు. శిక్షణ తరగతులలో డ్రైవర్లకు నైపుణ్యం అభివృద్ధిపై వివరించారు. శుక్రవారం శిక్షణ తరగతులు ముగిశాయి. ఈ సందర్భంగా శిక్షణ ఇచ్చిన చోళ ఎంఎస్ వారిని ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన శాలువాతో సత్కరించారు.

ఈవీఎం వాడకంపై ఓటర్లకు అవగాహన



నవతెలంగాణ-దస్తురాబాద్

మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో శుక్రవారం ఓటర్లకు ఈవీఎంలతో ఓటు వేసే విధానంపై ఎన్నికల అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ లక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు వేసే పద్ధతిని తెలుసుకోవాలని అన్నారు. వేసిన ఓటు రద్దు కాకుండా ఉండాలని ప్రభుత్వం మొదటగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుందని అన్నారు. ఆమె వెంట డీటీ తెలంగ్‌రావు, ప్రజాప్రతినిధులు ఎంపీపీ సింగరి కిషన్, వైస్ ఎంపీపీ రాజు నాయక్, సర్పంచ్ నిమ్మ తోట రాజమణి, శ్రీనివాస్, శివయ్య, ఓటర్లు పాల్గొన్నారు.

రహదారిపై వరినాట్లు వేసి నిరసన



నవతెలంగా-ఖానాపూర్‌టౌన్

పట్టణంలోని రోడ్లు బురదమయంగా మారినా ఎమ్మెల్యే రేఖానాయక్, మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్ పట్టించుకోక పోవడాన్ని నిరసిస్తూ శుక్రవారం కాంగ్రెస్ నాయకులు రహదారిపై వరినాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు దయానంద్, చిన్నం సత్యం, కిషోర్ నాయక్ మాట్లాడారు. మూడేండ్ల నుంచి సాగుతున్న రోడ్డు వెడల్పు పనులను పూర్తి చేయించడంలో ఎమ్మెల్యే పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. వర్షాలకు రహదారిపై నడవటానికి వీలులేకుండా మారి ప్రజలు తీవ్ర ఇబ్బంధులు పడుతున్నా ఎమ్మెల్యే స్పంధించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కడార్ల గంగనర్సయ్య, తోట సత్యం, అమానుల్లాఖాన్, షబ్బీర్ పాషా, నిమ్మల రమేష్, సలీంఖాన్, అరవింద్ పాల్గొన్నారు.

రాయిగూడ ఆశ్రమోన్నత పాఠశాలలో వైద్య శిబిరం



నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని రాయిగూడ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆర్‌బీఎస్‌కే వైద్య సిబ్బంది వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని వైద్యుడు నరేష్ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది కృష్ణవేణి, అరుణ్, వార్డెన్ లవ్‌సింగ్ పాల్గొన్నారు.

ప్రధాన దారిలో తాత్కాలిక మరమ్మతులు



నవతెలంగాణ-ఖానాపూర్‌రూరల్

గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బురదమైన రోడ్డుతో వాహనదారులతో పాటు, నడకప్రయాణం చేసేవారికి ఇబ్బంది కలుగుతున్న నేపథ్యంలో చైర్మెన్ అంకం రాజేందర్ వెంటనే స్పందించి శుక్రవారం తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. వెంటనే మున్సిపల్ సిబ్బందితో ట్రాక్టర్లలో కాంక్రీట్, డస్ట్ తెప్పించి వెంటనే రోడ్డుపై పోయించి తాత్కాలిక మరమ్మతులు చేయించారు. ఆయన వెంట కమిషనర్ మనోహర్‌గౌడ్, స్థానిక నాయకులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని ఎఎన్‌ఎం సుగుణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ, డ్రై డే నిర్వహణ గురించి ఇంటింటికి తిరిగి పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరుగుతూ నిల్వ నీటిని తొలగిస్తూ అవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉండటంతో జరిగే అనర్థాల గురించి వివరించారు. డెంగీ దోమలు నివారణ గురించి తెలిపారు. పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. నర్సాపూర్ (డబ్ల్యూ) గ్రామంలో సర్పంచ్ శ్రీవిద్య, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి నిల్వ నీటిని తొలగించుకోవాలని అన్నారు. పారిశుధ్య నిర్వహణ తీరును పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు

నవతెలంగాణ-ఖానాపూర్‌రూరల్



డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిజమైన నిరుపేదలకే కేటాయించాలనే ఉద్యేశంతో బీజేపీ ఆధ్వర్యంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల అప్లికేషన్ మేళాలను నిర్వహించే క్రమంలో బీజేపీ శ్రేణులను స్థానిక పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. శుక్రవారం బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పడాల రాజశేఖర్ అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిరుపేదలకు ఇల్లు కేటాయించాలని న్యాయంగా పోరాడుతుంటే అరెస్టు చేయడం సరైంది కాదని పోలీసుల తీరును ఆయన తప్పుబట్టారు. అరెస్ట్ అయిన వారిలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాయిని సంతోష్ ఉన్నారు.

అనుదినం జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మంచిర్యాల

కుమురం భీం-ఆసిఫాబాద్

శనివారం 22 జులై 2023

వాహనదారులకు పొంచి ఉన్న ప్రమాదం

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని ధర్మారం గ్రామం నుంచి కలమడుగు వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో ఉన్న బ్రిడ్జి సమీపాన పెద్ద గుంత పడింది. వచ్చిపోయే ద్విచక్ర వాహనదారులు ప్రమాదవశాత్తు అందులో పడిపోయే అవకాశాలు ఉన్నందున అధికారులు స్పందించి వెంటనే అక్కడ ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. శుక్రవారం ఓ ద్విచక్ర వాహనదారుడు ఆ గుంతలో పడిపోయాడు. ప్రమాదకరంగా మారిన ఆ గొంతును పూడ్చి ఇబ్బందులను తొలగించాలని వాహనదారులు, గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నవతెలంగాణ-కాసిపేట



సోమగూడెం కల్వరీ చర్చి సమీపంలో బెల్లంపల్లి బైపాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సోమగూడెంకు చెందిన జనగామ రజిత(40) అక్కడికక్కడే మృతి చెందింది. భర్త జనగామ తిరుపతికి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్ఐ గంగారాం తెలిపిన వివరాల ప్రకారం..సోమగూడెంకు చెందిన భార్యాభర్తలు జనగామ తిరుపతి, రజిత బెల్లంపల్లిలో బ్యాంక్ పని నిమిత్తం బైక్‌పై సోమగూడెం నుంచి బెల్లంపల్లికి వెళ్తుండగా కల్వరీ చర్చి సమీపంలోని బెల్లంపల్లి బైపాస్ వద్ద వెనుకాల వస్తున్న లారీ ఢీ కొంది. బైక్ ఉన్న రజిత లారీ టైర్ల కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందింది. భర్త తిరుపతికి స్వల్ప గాయాలయ్యాయి. మృతురాలికి ఇద్దరు కుమార్తెలున్నారు. రజిత మృతితో సోమగూడెంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

భయం గుప్పెట్లో తీర ప్రాంతవాసులు

- వరదల సీజన్ అంతా అటెన్షన్
- జిల్లాకు పొంచి ఉన్న వరద ముప్పు
- ఎంసీహెచ్ ఖాళీ చేయిస్తున్న వైనం
- కడెం నీరు ఎల్లంపల్లి చేరి మంచిర్యాలను ముంచనుందని హెచ్చరిక
- అధికార యంత్రాంగంలో నిర్లిప్తత

గోదావరి నీరు వచ్చిందంటే తీర ప్రాంతాల ప్రజల గుండెల్లో గుబులు రేగుతోంది. గడిచిన మూడేండ్లలో 4 పర్యాయాలు గోదావరి ఉగ్రరూపంతో పరివాహక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రైతులు తీరని నష్టానికి గురయ్యారు. వరదలతో వందలాది గృహాలు, సాగు భూములు నది పాలవుతున్నాయి. వరదలు ఉగ్రరూపం దాల్చే సమయంలోనే అధికారులు హడావిడిగా రక్షణ చర్యలు చేపట్టడం పరిపాటిగా మారింది. ముందస్తు చర్యలు కానరావడం లేదు. కడెం గేట్లు ఎత్తివేత, అధిక వర్షాలతో ఎల్లంపల్లికి భారీగా వరద నీరు రావడంతో గేట్లు ఎత్తేశారు. దీంతో మంచిర్యాల మళ్లీ మునగక తప్పని పరిస్థితుల్లో ఎంసీహెచ్‌లోని రోగులను హుటాహుటిన జిల్లా ఆసుపత్రికి తరలించారు.

నవతెలంగాణ-హాజీపూర్


జిల్లాలో 18 మండలాల్లో 8 మండలాల పరిధిలో సుమారు 20నది తీర గ్రామాలు, మంచిర్యాల, నస్పూర్, చెన్నూర్ పట్టణాలు వరద తాకిడికి గురవుతున్నాయి. 2022లో గోదావరి ఉగ్రరూపం దాల్చడంతో మంచిర్యాల పట్టణంలోని రాంనగర్, ఎన్టీఆర్‌నగర్, ఎల్ఐసి కాలనీ, పద్మశాలి కాలనీ, రెడ్డి కాలనీ, రాళ్లపేట్, గర్మిళ్ల తదితర ప్రాంతాలలో వరద నీరు ప్రవహించింది. వందల్లో ఇండ్లు నీట మునిగి భారీ నష్టం వాటిల్లింది. జిల్లాకు ఎంపీ, ఎమ్మెల్సీ, ముగ్గురు ఎమ్మెల్యేలు, అందులో ఒకరు ప్రభుత్వ విప్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరు వరదల సమయంలో తీర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులకు గురయ్యే దీర్ఘకాల సమస్యలపై దృష్టి సారించడం లేదని ముంపు ప్రాంతాల వాసులు వాపోతున్నారు. ఎన్నికలు సమీపించే సమయంలో దీర్ఘ కాల సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తామంటూ మభ్య పరుస్తూ సమస్యలను పరిష్కరించడం లేదని విమర్శలు వస్తున్నాయి.

ఇప్పుడు అప్రమత్తమైతే ఏం ఉపయోగం?

రెండేళ్లుగా ఎల్లంపల్లి వరద గేట్లు ఎత్తివేతతో హాజీపూర్ మండలంలోని వేంపల్లి, మల్కల్ల గ్రామాల్లోని పంట పొలాలు, మంచిర్యాల పట్టణంలోని ఇండ్లు, కాళేశ్వరం బ్యారేజ్ బ్యాక్ వాటర్‌తో జైపూర్, భీమారం, చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి మండలాల్లో వందల సంఖ్యలో ఇండ్లు, పంట పొలాలు నీట మునిగి కోట్లల్లో నష్టం వాటిల్లుతోంది. వరదల సమయంలో బాధితులను లోతట్టు ప్రాంతాల నుండి సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో మత్స్యకారుల తెప్పలు, పడవలే దిక్కవుతున్నాయి. ఇవి వరదలు వచ్చే రోజే ఏర్పాటు చేస్తున్నారు. ముందస్తు చర్యలు కానరావడం లేదు. ఏర్పాటు చేసిన వారికి సకాలంలో బిల్లులు చెల్లించలేదనే విమర్శలు లేకపోలేదు. దీంతో ఈ సారి వరదలు వస్తే వారు కూడా అందుబాటులో ఉండే అవకాశాలు తక్కువే. ఇప్పుడు అప్రమత్తత అయితే ఉపయోగం లేదని, ముందస్తుగా అన్ని సహాయక చర్యలు చేపట్టేలా ప్రణాళిక ఉండాలని ప్రజలు కోరుతున్నారు.

హెచ్చరికల నేపథ్యంలో హడావుడి

నాలుగు రోజుల నుండి వచ్చే రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తోంది. కానీ శుక్రవారం మధ్యాహ్నం వరకు జిల్లా యంత్రాంగం ఎలాంటి చర్యలు చేపట్టలేదు. వారి వారి పనుల్లో బిజీ అయిపోయారు. శుక్రవారం కడెం ప్రాజెక్ట్ మొత్తం గేట్లు ఎత్తివేయడంతో గోదావరికి వరద ఉధృతి పెరిగే అవకాశం ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఎల్లంపల్లి ప్రాజెక్ట్ గేట్లు ఎత్తివేత తప్పలేదు. వానలతో వరద నీరు, కడెం ప్రాజెక్ట్ గేట్లు ఎత్తి వేయడంతో ఎల్లంపల్లి నిండి సాయంత్రం వరకు 25గేట్లు ఎత్తేశారు. దీంతో మొన్నటి దాకా కాళేశ్వరం నీటిని ఎల్లంపల్లికి తోడే క్రమంలో సుందిళ్ల బ్యారేజ్‌లో నీటి నిల్వ కూడా సామర్థ్యానికి దగ్గరలో ఉండడంతో గోదావరి పోటు కమ్మి మంచిర్యాలను పోటేత్తే అవకాశం ఉండంతో గోదావరి రోడ్డులోని మాతా శిశుఆరోగ్య కేంద్రంలోని రోగులను జిల్లా ఆస్పత్రికి తరలించారు. తరలింపు కోసం ప్రతిపక్ష కాంగ్రెస్‌నాయకులు పూనుకోవడంతో పోటీగా అధికార పార్టీ నాయకులు రోగులను తరలించారు. జిల్లా ఆసుపత్రిలోని రోగులను హడావుడిగా డిశ్చార్జి చేశారు. రామగుండం సీపీ రెమా రాజేశ్వరి, డీసీపీ రాంనాథ్ కోకెన్, ఏసీపీ తిరుపతిరెడ్డి ఎల్లంపల్లిని సందర్శించి గేట్లు ఎత్తి వేసే ప్రక్రియను పరిశీలించారు. పోలీస్ శాఖ నుండి హెచ్చరికలు జారీ చేశారు. కలెక్టర్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి వరద పరిస్థితులపై వాకబు చేస్తూ జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు.



ఎల్లంపల్లి ప్రాజెక్ట్ వద్ద రామగుండం సీపీ రెమా రాజేశ్వరి



మాతా శిశు ఆరోగ్య కేంద్రంలోని తల్లీబిడ్డలను జిల్లా ఆసుపత్రికి తరలింపు

సమ్మెలో పంచాయతీ కార్మికులు

వరదలు ముంచెత్తి కాలనీలు జలమైన సందర్భంలో పంచాయతీ కార్మికుల విధులు వెలకట్టలేనివి. వారు లేనిదే ఆ కాలనీలు యథా స్థానానికి వచ్చే వవకాశం లేదు. గతంలో మంచిర్యాలను వరద ముంచెత్తిన సమయంలో మున్సిపల్ కార్మికులతో పాటు సమీప గ్రామాల పంచాయతీ కార్మికులు సహాయక చర్యలలో పాల్గొని పారిశుధ్య పనుల్లో భాగస్వామ్యమైతేనే కాలనీలు కంపు కొట్టకుండా ఉన్నాయి. ప్రస్తుతం పంచాయతీ కార్మికులు సమ్మెలో ఉండగా మళ్లీ వరదలు పునరావృతమైతే సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడనుంది.

బూరుగూడ బీసీ కాలనీలో మురుగు కాలువ నిర్మించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బూరుగూడ బీసీ కాలనీలో హైవే అథారిటీ ఆధ్వర్యంలో సైడ్ డ్రైనేజ్ నిర్మించాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. ఎంపీపీ మల్లికార్జున్, గ్రామస్తులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో బీసీ కాలనీలో డ్రైనేజీ నిర్మిస్తానని హైవే అధికారులు తెలిపినట్లు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. డ్రైనేజీ నిర్మించకపోవడంతో కాలనీలో ఇండ్లలోకి నీరు ప్రవేశిస్తోందని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. డ్రైనేజీ నిర్మించేలా హైవే అధికారులపై, కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శైలేందర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల వారికి పురావాసం ఏర్పాటు చేయాలి

- భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి



నవతెలంగాణ-జైపూర్

భారీగా కురుస్తున్న వర్షాలతో అధికారులు ఎక్కడికక్కడ అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి ఆదేశించారు. శుక్రవారం చెన్నూర్ శివారు నిజామాబాద్-జగ్దల్‌పూర్ అంతరాష్ట్ర రహదారిలో గల బతుకమ్మ వాగు వంతెన అప్రోచ్ రోడ్డు కూలిపోతున్న తీరును పరిశీలించారు. అదేవిధంగా అంతరాష్ట్ర సరిహద్దు ప్రాణహిత నది వంతెన, అన్నారం శివారులో గోదావరిపై నిర్మించిన సరస్వతి బ్యారేజ్‌లను సందర్శించారు. ప్రాణహిత, గోదావరి నదుల మీదుగా ప్రవహిస్తున్న వదర ప్రవాహాన్ని పరిశీలించారు. మరో నాలుగు రోజుల పాటు భారీగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని లోతట్టు ప్రాతం ప్రజలకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి ముందస్తుగా వారిని తరలించాలని తెలిపారు. చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల కాల్వల నీటి నిల్వలు పరిశీలిస్తూ నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. వర్షాల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అప్రమత్తత పాటించాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరితో పాటు మంచిర్యాల డీసీపీ సుధీర్ కేకన్, జైపూర్ ఏసీపీ మోహన్, చెన్నూర్ పట్టణ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వాసుదేవరావు, రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ విద్యాసాగర్, కోటపల్లి ఎస్సై రమేష్ ఉన్నారు.

అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలి

నవతెలంగాణ - హాజీపూర్

విద్యా శాఖలో పైరవీలతో ట్రన్స్‌ఫర్లపై వస్తున్న ఆరోపణలపై టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీఈవోను కలిసి వివరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గొల్ల రామన్న, గుర్రాల రాజావేణు మాట్లాడుతూ అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న సర్దుబాటు ఉత్తర్వులను రద్దు చేయాలన్నారు. నిబంధనలు అనుసరించి మళ్లీ సర్దుబాటు చేయాలని తెలిపారు. ఉత్తర్వులను రద్దు చేయకుంటే రద్దయ్యే వరకు ఉద్యమం కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి బుక్య కిరణ్, జిల్లా కార్యదర్శి వేల్పుల కిరణ్‌కుమార్, లక్షెట్టిపేట్ మండలం అధ్యక్షులు బండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి పెంచుకోవాలి

నవతెలంగాణ-జైపూర్

ఆహార, వాణిజ్య పంటలతో పాటు పండ్ల తోటల పెంపకంపై రైతులు అవగాహన పెంచుకోవాలని ఎంపీపీ గోదారి రమాదేవి లక్ష్మన్ పేర్కొన్నారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టం ద్వారా ఉద్యానవన, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రైతు వేదికలో మండల పరిధి ప్రజాప్రతినిదులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిధిలో పండ్ల మొక్కలు పెంచుకోవడంలో లక్ష్యాన్ని పూర్తి చేయాలని కోరారు. 125 ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటడం కోసం రైతుల ఇష్టానుసారం కోరుకున్న మొక్కలను శాఖ పరంగా సబ్సిడీపై పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. 5ఎకరాల్లోపు వ్యవసాయ భూమి గల రైతులకు గ్రామీణ ఉపాధి ద్వారా మొక్కలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. నెల చివరి నాటికి మొక్కలు నాటే ప్రక్రియ పూర్తి చేయాలన్న కలెక్టర్ విధించిన టార్కెట్ లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఎంపీడీఓ సత్యనారాయణ కోరారు. ఈ సమావేశంలో ఉద్యానవన శాఖ అధికారి తిరుపతి, మండల వ్యవసాయ అధికారి మార్క్‌గ్లాడ్సన్, ఈజీఎస్ ఏపీఓ బాలయ్య, ఎంపీఓ అనిల్ కుమార్, స్థానిక ఎంపీటీసీ లింగస్వామి, గ్రామ పంచాయతి కార్యదర్శులు, వ్యవసాయ విస్తీర్ణాధికారులు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణంలో నిర్లక్ష్యం తగదు

నవతెలంగాణ-కెరమెరి

వంతెన నిర్మాణం పూర్తి చేయడంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యం చేయడం సరైంది కాదని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు రాథోడ్ రూప్‌లాల్ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని అనార్‌పల్లి పెద్ద వాగు ఉప్పొంగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి మాట్లాడారు. 2016లో వంతెన నిర్మాణం పనులు ప్రారంభించారన్నారు. నేటికీ వంతెన పనులు పిల్లర్ల దశలోనే కూరుకుపోయాయని తెలిపారు. వంతెన పనులు నత్తనడకన కొనసాగుతుడడంతో పరిసర గ్రామాల ప్రజలకు వర్షాకాలం ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజులుగా కురుస్తున్న ఎడతెరపి లేని వర్షాలతో అనార్‌పల్లి పెద్ద వాగు ఉప్పొంగి ప్రవహిస్తుందని తెలిపారు. దీంతో పరిసర గ్రామాల ప్రజలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందన్నారు. నిత్యం మండల కేంద్రానికి రాకపోకలు కొనసాగించే గ్రామాల ప్రజలకు వాగు దాటడం కష్టంగా మారిందని పేర్కొన్నారు. వంతెన పనులు పూర్తి చేయాలని పలు మార్లు అధికారులు, పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అధికారులు స్పందించి అనార్‌పల్లి పెద్ద వాగు వంతెన పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులు రాజు నాయక్, బల్వంత్ నాయక్, శంకర్ నాయక్, భానునాయక్, రాథోడ్ జలపత్‌నాయక్ పాల్గొన్నారు.

ఎడతెరిపిలేని వర్షాలు.. పొంగిపొర్లుతున్న వాగులు...

నవతెలంగాణ-జైపూర్

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఎటూ కదలలేని పరిస్థితి నెలకొంది. నాలుగు రోజుల నుండి వర్షాలు కురుస్తుండడం, మరో నాలుగు రోజుల పాటు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడింది. రాత్రింబవళ్లు ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. టేకుమట్ల శివారు రసూల్‌పల్లి పెద్ద వాగు పొంగిపొర్లుతోంది. పెగడపల్లి-జైపూర్ మధ్య ఈదుల వాగు మీదుగా వదర నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఫలితంగా టేకుమట్ల మీదుగా శివ్వారం వైపు వాహనాల రాకపోకలను నిలిపేశారు. అదేవిధంగా జైపూర్ నుండి పెగడపల్లి మీదుగా షెట్‌పల్లి ఎక్స్ రోడ్డు మీదుగా రాకపోకలకు ఇదే పరిస్థితి నెలకొంది. వర్షాలకు శ్రీరాంసాగర్, కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టుల మీదుగా వచ్చే వరదను సుందిళ్ల బ్యారేజ్ ద్వారా దిగువకు వదులుతున్నారు. సుందిళ్ల బ్యారేజ్‌లో వచ్చి చేరుతున్న వరదను 60 గేట్ల ద్వారా బయటకు వదులుతున్నట్లు తహసీల్దార్ మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు లక్ష క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతుండగా మీది నుండి వచ్చే వరద తీవ్రతను బట్టి ప్రాజెక్టు గేట్లు ఎత్తి 2,3లక్షల క్యూసెక్కులు వదిలే అవకాశం ఉన్నట్లు తెలిపారు. మండల పరిధిలో 54.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. గోదావరి నది హద్దుల్లో ప్రవహిస్తుండగా ప్రస్తుత పరిస్థితుల్లో పంట పొలాలకు ఎలాంటి వరద ముప్పు ఉండదని తెలిపారు. 6 నుండి 8 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నప్పుడు లోతట్టు ప్రాంతాల్లో వరద వచ్చి చేరుతుందని తెలిపారు. గోదావరి నది నిండుగా ప్రవహిస్తున్నందున తీర ప్రాంత గ్రామాల ప్రజలు గోదావరి వైపు వెళ్లకుండా ఉండాలని, పశువులు సైతం అటు వైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా శిథిలమైన ఇండ్లు, ఇనుప విద్యుత్ స్తంభాలు, వర్షంలో బాగా తడిసిన మొండి గోడలకు దగ్గరగా ఉండాలని హెచ్చరించారు.

- టేకుమట్ల-షెట్‌పల్లి మధ్య నిలిచిన రాకపోకలు



అవసరమైతే తప్ప ప్రయాణాలు పెట్టుకోరాదు : కలెక్టర్ సంతోష్

మరో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున గ్రామీణ ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలి. అవసరమైతే తప్ప ప్రయాణాలు పెట్టుకోరాదని కలెక్టర్ సంతోష్ తెలిపారు. టేకుమట్ల, పెగడపల్లి శివారులో వాగులు పొంగిపొర్లుతుండటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడినట్లు తెలిసి శుక్రవారం అడిషినల్ కలెక్టర్ రాహుల్‌తో కలిసి సంఘటనా స్థలాలను పరిశీలించారు. టేకుమట్ల శివారులో రసూల్‌పల్లి వాగు పొంగిపొర్లుతున్నందున ఆ రహదారిపై రాకపోకలు సాగించకపోతే మంచిదని సూచించారు. గోదావరి వరద ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించడంతో పాటు ఎటువంటి ఆస్థి, ప్రాణ నష్టం జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ మోహన్‌రెడ్డిని ఆదేశించారు. మత్సకారులు, పశువులు, మనుషులు గోదావరి వైపు వెళ్లకుండా తీర ప్రాంతాల వారిని అప్రమత్తం చేయాలని సూచించారు.

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె



నవతెలంగాణ - కాసిపేట

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె కొనసాగుతోంది. శుక్రవారం సమ్మె 16వ రోజుకు చేరుకుంది. అయినా ప్రభుత్వం పట్టించుకోడం లేదని పంచాయతీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి డిమాండ్లు పరిష్కరించాలని కోరారు.

బెస్ట్ అవైలబుల్ పాఠశాలకు లక్కీడ్రా ద్వారా ఎంపిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో ప్రవేశాల కోసం లక్కీ డిప్ ద్వారా అదనపు కలెక్టర్ రాజేశం విద్యార్థులను ఎంపిక చేశారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో లక్కీ డిప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటవ తరగతిలో ప్రవేశం కోసం 40 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని, ఐదో తరగతిలో ప్రవేశం కోసం 71 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఒకటో తరగతి దరఖాస్తు చేసుకున్న వారిలో 31 మందిని అర్హులుగా గుర్తించి లక్కీ డిప్ ద్వారా వారందరికీ సీటు కేటాయించామన్నారు. ఐదో తరగతిలో 48 మంది అర్హులు కాగా 40 మందికి లక్కీ డిప్ ద్వారా సీట్ కేటాయించినట్లు తెలిపారు. విద్యార్థులు అవకాశానికి సత్యనియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సజీవన్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫిట్ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ - రెబ్బెన

ఖైరిగూడ ఓపెన్‌కాస్టు వద్ద ఫిట్ కమిటీ సమావేశం గోలేటి కేఎల్ మహేంద్రభవనంలో అబ్దుల్ రెహమాన్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా గోలేటి బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తింపు సంఘం టీబీజీకేయస్ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కార్మికులకు మెరుగైన లెవెన్ వేజ్‌బోర్డు సాధించడంలో ఏఐటీయూసీ కృషి ఉందన్నారు. అనంతరం నూతన ఫిట్ కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శులు జగ్గయ్య, శేషశయనరావు, జూపాక రాజేష్, కిరణ్‌బాబు, ఆనంద్, శివరావు, నాయకులు కృష్ణమోహన్, రాజేష్, కాంట్రాక్టు కార్మికుల సంఘం బ్రాంచ్ కార్యదర్శి చల్లూరి అశోక్, సాయి, కార్యదర్శి సాగర్‌గౌడ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన యువకులు

నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని యువకులు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. గద్దరాగెడిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ రాజా రమేష్ బాబు ఆధ్వర్యంలో యువకులు పార్టీలో చేరారు. వారికి డాక్టర్ రాజా రమేష్ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ వస్తే విద్యార్థుల, యువకుల జీవితాలు మారుతాయని అనుకున్నా అందరికీ దు:ఖమే మిగిలిందన్నారు. యువకులు చైతన్యవంతులు కావాలని, పోరాడి సాధించుకున్న స్వరాష్ట్రంలో ప్రజలు అస్తిత్వం కోసం పోరాడే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో ప్రజల ఆకాంక్షను సఫలం చేసుకోవాలంటే కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టే విధంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కోరారు.

తెలంగాణ బొగ్గు బ్లాకులు సింగరేణికే కేటాయించాలి

- ఎస్‌కేఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు



నవతెలంగాణ-నస్పూర్

తెలంగాణలో ఉన్న బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జేబీసీసీఐ సభ్యుడు మంద నరసింహారావు అన్నారు. శుక్రవారం ఎస్ఆర్పి3,3ఏ, వర్క్‌షాప్‌లో డివిజన్ కార్యదర్శి గోదారి భాగ్యరాజు అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. సింగరేణిలో ఇప్పుడు ఉన్న ఓపెన్‌కాస్టు, అండర్ గ్రౌండ్ మైన్స్ కేవలం 10 నుండి 15 సంవత్సరాల లోపల బొగ్గు నిక్షేపాలు అయిపోయే ప్రమాదం ఉన్నదని, కొత్త బొగ్గు బ్లాకులు సింగరేణికి కేటాయించకపోతే సింగరేణి మనుగడకే ప్రమాదం వచ్చే పరిస్థితి ఏర్పడనుందన్నారు. కేంద్ర ప్రభుత్వం వేలంపాట ద్వారా బడా పెట్టుబడిదారులతో కుమ్మక్కై కారుచౌకగా బొగ్గు బ్లాకులను కొట్టేస్తున్నారని విమర్శించారు. సింగరేణి సంస్థ వేలంపాటలో పాల్గొనాలంటే 14శాతం రెవెన్యూ షేరింగ్ కేంద్ర ప్రభుత్వానికి కట్టాల్సి ఉంటుందని, ఇప్పుడున్న పరిస్థితుల్లో రెవెన్యూ షేరింగ్ కట్టి బ్లాకులను తీసుకునే పరిస్థితి తెలంగాణలో ఉన్న బొగ్గు బ్లాకుల నైసర్గిక స్వరూపాన్ని బట్టి చూస్తే అది నష్టదాయకంగా ఉంటుందన్నారు. గతంలో నాలుగు బొగ్గు బ్లాక్ టెండర్లకు పిలిచినప్పుడు ఈ కేంద్ర ప్రభుత్వ టెండర్ల విధానానికి వ్యతిరేకంగా అన్ని కార్మిక సంఘాలు కార్మికులు మూడు రోజుల సమ్మె చేసి టెండర్లు వేయకుండా అడ్డుకున్నారని తెలిపారు. అయినప్పటికీ కోయగూడెం-3 బ్లాకు మెగా ప్రాజెక్టును ఒకే ఒక్క అరబిందో ఫార్మా కంపెనీ టెండర్ వేయడం జరిగిందని, ఒక్క బొగ్గు పెల్ల తీసిన అనుభవం లేనటువంటి అరబిందో ఫార్మా కంపెనీకి కోయగూడెం బ్లాక్‌ను ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. అదీ కాక అరబిందో ఫార్మా కంపెనీ యజమాని ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో జైల్లో ఉన్నాడని, ఇలాంటి దోపిడీదారులకు తెలంగాణలోని బొగ్గు బ్లాక్‌లను బిజెపి ప్రభుత్వం ఎలా కట్టబెట్టుతుందో కేంద్ర ప్రభుత్వమే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గుల్ల బాలాజీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంగళ శ్రీనివాస్, కస్తూరి చంద్రశేఖర్, అజయ్, సంగం రాజయ్య, శ్రీధర్, ఆవునూరి మహేష్, సాయిల్ల శ్రీనివాస్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఈవీఎం ద్వారా ఓటు వినియోగంపై అవగాహన

నవతెలంగాణ-నస్పూర్

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈవిఎం, వివి పాట్ ప్రదర్శన కేంద్రాన్ని ప్రారంభించినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బదావత్ సంతోష్ తెలిపారు. గురువారం సమీకృత జిల్లా శాఖల కార్యాలయాల భవన సముదాయంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాహుల్, ట్రైనీ కలెక్టర్ పి.గౌతమితో కలిసి ఈవిఎం, వివి పాట్ ప్రదర్శన కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంవత్సరం కావడంతో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం వినియోగించే విధంగా తెలుసుకునేందుకు ప్రజల సౌకర్యార్థం ఈవిఎం, వివి ప్యాట్ ప్రదర్శన కేంద్రం ప్రారంభించామన్నారు. వివిధ పనుల నిమిత్తం కలెక్టరేట్ వచ్చే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వర్షాలపై కలెక్టర్ సమీక్ష

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా జిల్లాలోని ప్రాజెక్టులకు చేరుకున్న వరద నీటి ఉధృతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్షించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు, మేడిగడ్డ, సరస్వతి, పార్వతి బ్యారేజ్‌తో పాటు జిల్లాలోని వాగులలో చేరుతున్న వరదనీటి పరిస్థితులను పరిశీలించాలని, ఆయా ప్రాజెక్టులు, బ్యారేజ్‌లో నీటి నిల్వ సామర్థ్యానికి అనుగుణంగా పైప్రాంతాల నుండి చేరుతున్న వరదనీటిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ క్రమంలో లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని తెలిపారు. వరద కారణంగా అత్యవసర పరిస్థితులు ఏర్పడినట్లయితే ప్రజలకు సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించాలని పేర్కొన్నారు.

ఆకులు తింటూ పంచాయతీ కార్మికుల నిరసన

నవతెలంగాణ-ఖానాపూర్



ఆకులు తింటూ గ్రామపంచాయతీ కార్మికులు శుక్రవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. గత 16 రోజులుగా సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కనీస వేతనాలు అందజేయాలని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికులతో చర్చలు జరిపి న్యాయం చేయాలని అన్నారు. లేని పక్షంలో సమ్మె ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి నాగరాజు, కోశాధికారి స్వామి, పోశెట్టి, రవి పాల్గొన్నారు.

కుంటలో పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-బోథ్



మండలంలోని ధన్నూర్(బి) గ్రామానికి చెందిన జూపాక రాజేశ్వర్(47) కుంటలో పడి మృతి చెందాడు. భార్య పోసాని తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం రాత్రి కాలకృత్యాల కోసం వెళ్లారు. కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువన నుంచి వరద రావడంతో దాటే ప్రయత్నంలో పక్కనే ఉన్న కుంటలో పడి మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కొడుకులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

భారీ వర్షం.. జన జీవనం అస్తవ్యస్తం..

- పలు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం



ఇంద్రవెల్లి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి జన జీవనం అస్తవ్యస్తం అయ్యింది. శుక్రవారం మండలంలో వాగులు, వంకలు, ఉప్పొంగి పొర్లాయి. దీంతో మారుమూల గిరిజన గ్రామాలకు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. మండలంలో 124.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. భారీ వర్షానికి వాడగావ్ పంచాయతీలోని జైత్రాం తండ, జెండాగూడ, గౌరాపూర్ పంచాయతీలోని చిత్త భట్ట, హర్కాపూర్, పంచాయతీలోని మామిడి (జి), మర్కగూడ పంచాయతీలోని సట్వాజీగూడ, దస్నాపూర్ పంచాయతీలోని అందుగూడ తదితర గ్రామాల ప్రజలు వాగుల ధాటికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. జైత్రాం తండ వాసుల మూడు ద్విచక్ర వాహనాలు కొట్టుకు పోగా గ్రామస్తుల సహాయంతో వెతికి తీసుకున్నారు. వీరు ప్రతి రోజు నిత్యావసర వస్తువులు, వైద్యం, వ్యవసాయ సామగ్రి కొనుగోలు కోసం మండల కేంద్రానికి వెళ్లాల్సిందే, గ్రామ సమీప వాగులు పొంగి పోర్లడంతో బిక్కు బిక్కు మంటు తమ ఇంట్లోనే గడిపారు. చిత్త భట్ట గ్రామస్తులు వారి పంచాయతీ గౌరాపూర్‌కు సంబంధాలు తెగిపోవడంతో 3 కి.మీ.మేర కాలినడకన వెళ్లి వయా కెస్లాపూర్ మీదుగా వెళ్లాల్సివస్తోంది. దస్నాపూర్ గ్రామ సమీప వాగు ఉధృతికి విద్యుత్ సబ్ స్టేషన్ వరకు వరద నీరు చేరింది. వాగు పరివాహక పొలాల్లో పత్తి, సోయా పంట నీట మునిగింది. వాల్గొండ జీపీ, దస్నాపూర్, వడగావ్ జీపీ పరిధిలో వాగుల పక్కకు పంటపొలాలు ఉండటంతో పత్తి, సోయా తదితర పంటలకు భారీగా నష్టం వాటిల్లిందని ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు జుగాది రావ్, కేశవ్ పేర్కొన్నారు. ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా సర్వే నిర్వహించి పంటలు నష్ట పోయిన రైతులను ఆదుకోవాలని కోరారు.

త్రివేణి చెరువులో చేపలకు భలే గిరాకీ...

ముత్నూర్, శంకర్‌గూడ గ్రామాల మధ్యనున్న త్రివేణి సంఘం చెరువు భారీ వర్షానికి నిండు కుండలా మారింది. చెరువు మత్తడి నుంచి నీళ్ల పరవళ్ల తొక్కడంతో పెద్ద పెద్ద చేపలు పట్టడంలో పరిసర గ్రామ ప్రజలు నిమగ్నమయ్యారు. ఒక్కొక్క చేప 5-7 కిలోల వరకు తాజాగా ఉండటంతో ఉట్నూర్ నుంచి జిల్లా కేంద్రం వైపు వెళ్లే ప్రజలు కొనుగోలు చేశారు. దీంతో చేపల వేట జోరుగా సాగింది.

నార్నూర్ : ఉమ్మడి నార్నూర్ మండలంలో శుక్రవారం భారీ కుండపోత వర్షం కురిసింది. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి వాగులు, వంకలు, చెరువులు నిండాయి. దీనితో చాలా గ్రామాల ప్రజలకు రాక పోకలకు అంతరాయం ఏర్పడింది. కురుస్తున్న భారీ వర్షానికి కునికాసా, కొత్తపెల్లి, చిత్తగూడ, డోంగర్‌గావ్, అర్జుని, మారుగూడ, దాబా(బి), దాబా(కే), లోకారి(కే), ఖడ్కి, ధర్మగూడ, కుండి షెక్‌గూడతో పాటు తదితర గ్రామాల ప్రజలకు వాగు రావడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గుంజాల, తాడిహత్నూర్, జామడా, మర్కగూడ, గంగాపూర్, బెత్తల్‌గూడతో పాటు తదితర గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల వ్యవసాయ పొలంలో పంటలు నీట మునిగిపోయాయి. దీనితో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎడతెరిపి లేకుండా కురిస్తున్న వర్షంతో చాలా చోట్ల ఇండ్లలోకి నీరు చేరింది.

సిరికొండ : సిరికొండ మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం భారీ వర్షం కురిసింది. పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రిమ్మ నుంచి మండల కేంద్రానికి వెళ్లే రోడ్డు కొట్టుకుపోయింది. చెట్లు విరిగి రోడ్డుపై పడ్డాయి. చిక్మాన్ వాగు పొంగిపోర్లడంతో పాటు కొండాపూర్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగింది. కొండాపూర్ బ్రిడ్జిని మండల తహశీల్దార్ వర్ణ పరిశీలించారు. నారాయణ్‌పూర్ గ్రామ చెరువు కట్ట తెగిపోయి, నీళ్ల ఇండ్లలోకి చేరాయి. గ్రామస్తులు భయభ్రాంతులకు గురయ్యారు. కొంత నష్టం వాటిల్లింది. ధర్మసాగర్ గ్రామ సమీపంలోని కల్వర్టు కోతకు గురయింది. లచ్చింపూర్(బి) గ్రామంలో బాదు అనే గిరిజన రైతు తన పొలంలోని కొట్టంలో పశువులను కట్టేసి ఇంటికి వెళ్లాడు. కురిసిన భారీ వర్షం వల్ల ఒక ఎద్దు, 50 పైపులతో పాటు కొట్టం మొత్తం కొట్టుకుపోయింది. దాదాపుగా లక్ష రూపాయల వరకు నష్టం వాటిల్లిందని గ్రామస్తులు తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో కూడా వర్షపు నీరు ఇండ్లలోకి చేరింది. వాగులు వంకలు పొంగిపొర్లాయి. రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు కూడా పడిపోయాయి. విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో, విద్యుత్ అధికారులు తొందరగానే స్పందించి ఎటువంటి ఆటంకం లేకుండా చూశారు.

ఉట్నూర్ : గత కొన్ని రోజులుగా ఏజెన్సీ ప్రాంతంలో వర్షాలు కురుస్తున్నాయి. తాజాగా రెండు రోజులుగా ఏజెన్సీ ఏరియాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీని వల్ల వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. వాగులు దాటి వెళ్లే గ్రామాలకు వెళ్లేందుకు గిరిజనులు అనేక తిప్పలు పడుతున్నారు. మండలంలోని నాగపూర్ వాగు, వంకతుమ్మ, నర్సాపూర్(జె), దంతన్‌పల్లి, పులిమడుగు, లక్షెట్టిపేట, కన్నాపూర్, రాజులమడుగు, సాలేవాడ(కె), తదితర గ్రామాల సమీపంలో ఉన్న వాగులు ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా పులిమడుగు నుంచి సాలేవాడ(కె)కు వెళ్లే రోడ్డు మధ్యలో తెగిపోయింది. దీంతో రాకపోకలు బంద్ అయ్యాయి. సాలేవాడ(కె) సర్పంచ్ నందకుమార్ వెంటనే ఎంపీపీ పంద్రా జైవంత్ రావ్, డీఈ రమేష్‌కి సమాచారం అందించారు. ఎంపీపీ అక్కడికి చేరుకొని కోతకు గురైన రోడ్డును పరిశీలించారు. రాకపోకలకు సాగించే విధంగా చర్యలు తీసుకుంటామని ఎంపీపీ పేర్కొన్నారు. గడిచిన 24గంటల్లో ఉట్నూర్ 59 మీ.మీ, ఇంద్రవెల్లి 124మీ.మీ, నార్నూర్ 11మీ.మీ, గాదిగూడ 14మీ.మీ వర్షపాతం నమోదైంది.

ఇచ్చోడ : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న బారీ వర్షానికి శుక్రవారం మండలంలోని పలు గ్రామాలు జలమయం అయ్యాయి. మండల కేంద్రంతో పాటు మాదాపూర్, దుబార్‌పెట్ గ్రామంలో జలమయం కాగా, ఇచ్చోడలోని లోతట్టు కాలనీలైన సుభాష్‌నగర్, పాత ఎస్సీ కాలనీ, ఇస్లాంపురా, రంజాన్ పురా, కోజాకాలనీలలోకి భారీగా నీరు చేరడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నిత్యవసర సరకులు తడిసిపోయాయి. జీవాజి చౌక్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు రోడ్డుపై నీటి ప్రవాహం జలపాతం తలపించేలా కనిపించింది. దీనితో చిరు వ్యాపారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. నీరు చేరడానికి ప్రధాన కారణం రోడ్డుకు ఇరువైపుల మురికి కాలువలు లేకపోవడమేనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. పేరుకు మేజర్ గ్రామ పంచాయతీ కాని కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని ప్రజలు అభిప్రాయం వ్యక్తం చేశారు.

బోథ్ : మండలంలోని గత మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండల కేంద్రం సమీపంలో కాంగ్రీ వాగు బ్రిడ్జి కూలిపోవడంతో, అలాగే మర్లపల్లి కంటేగామ రోడ్డు కోతకు గురవడంతో ఆయా 20 గ్రామాల ప్రజలకు బోథ్ మండల కేంద్రానికి రాకపోకలు అంతరాయం కలిగింది. అదేవిధంగా మర్లపెల్లి, బోథ్, సొనాల, కనుగుట్ట దన్నూర్(బి) గ్రామాలలో వాగు సమీపంలో ఉన్న పంటలు కొట్టుకుపోయి, భారీ నష్టం వాటిల్లింది. అలాగే అయా గ్రామాలలో కరెంటు స్తంభాలు పడిపోయి ట్రాన్స్‌ఫార్మర్లు వాగులో కొట్టుకుపోయాయి. దీంతో రాత్రంతా విద్యుత్ అంతరాయం ఏర్పడింది. అలాగే సాయి నగర్, సొనాల, పలు ఇండ్లలో వరద నీరు చేరి నిత్యవసర సామాగ్రి పనికిరాకుండా పోయాయి. దీంతో ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపరిహారాన్ని అందించాలని ప్రజలు కోరారు.



సిరికొండ



నార్నూర్

మంత్రిపై ఆరోపణలు చేయడం సరికాదు

- మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్

నవతెలంగాణ-నిర్మల్

బీజేపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డిపై ఇష్టానుసారంగా, నిరాదరణ, ఆరోపణలు చేయడం సరికాదని మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి మీడియా సమావేశంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి బీజేపీలో చేరేందుకు ప్రయత్నం చేస్తున్నారని, సమాచారం తన వద్ద ఉందని చెప్పటం సరికాదని అన్నారు. స్వార్ధ ప్రయోజనాల కోసం సెక్యులర్ కాంగ్రెస్‌ని వదిలి మతతత్వ బీజేపీలో చేరారని అన్నారు. రాష్ట్రంలో ముచ్చటగా మూడోసారి సీఎం కేసీఆర్‌ను, ఇటు నిర్మల్ నియోజకవర్గ ప్రజలందరూ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిని ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తారని అన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు మారుగొండ రాము, ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మెన్ ధర్మాజీ రాజేందర్, హజ్ కమిటీ సభ్యులు ఎండీ నజీరోద్దీన్, మార్కెట్ కమిటీ చైర్మెన్ చిలుక రమణ, జిల్లా అధికార ప్రతినిధి ముడుసు సత్యనారాయణ, కౌన్సిలర్ విప్ నేరేళ్ల వేణు, కౌన్సిలర్లు యస్పీ రాజు, గండ్రత్ రమణ, అడప పోశెట్టి, అన్వర్ పాషా, బిట్లింగ్ నవీన్, ఆకుల రామకృష్ణ, ఎడిపెల్లి నరేందర్, అబ్దుల్ మతిన్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ కొప్పుల శ్రీధర్, దేవర కోట ఆలయ డైరెక్టర్ అనిల్ కుమార్, కళ్యాణ్, జాఫర్, శివ పూదరి, భూపతి, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

లక్ష్మణచాంద : బీజేపీ నాయకులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి చౌకబారు ప్రచారాలు మానుకోవాలని మండల బీఆర్ఎస్ కన్వీనర్ కోరిపెల్లి కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి బీజేపీలో చేరటం కోసం ప్రయత్నం చేస్తున్నాడని మహేశ్వర్‌రెడ్డి అనటం హస్యాస్పదంగా ఉందని తెలిపారు. మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి గెలుపు గుర్రం అన్న సంగతి నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసునని, బీజేపీలోకి వెళ్లాల్సిన అవసరం ఏ మాత్రం లేదని, మహేశ్వర్‌రెడ్డి అర్థం పర్థం లేకుండా మాట్లాడటం ఆయన అవివేకానికి నిదర్శణమని పేర్కొన్నారు. అనుచరులంతా ఒక్కొక్కరు ఇతర పార్టీల్లో చేరటంతో ఏం చేయాలో తోచక నోటికి వచ్చినట్లు మాట్లాడుతూ మహేశ్వర్‌రెడ్డి తన స్థాయిని దిగజార్చుకుంటున్నారని పేర్కొన్నారు.

అంత్యక్రియలకు వచ్చి వ్యక్తి హఠాన్మరణం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి రామచంద్రారెడ్డి భౌతికాయానికి చూడటానికి వేలాది మంది అభిమానులు తరలివచ్చారు. ఇందులో భాగంగా మాదిగ హక్కుల దండోరా జిల్లా కన్వీనర్ పెర్క రాజేశ్వర్ సైతం మాజీ మంత్రికి నివాళులర్పించడానికి రాగా అకస్మాత్తుగా ఆయన ఇంటి ముందు రోడ్డుపై స్పృహకోల్పోయి కింద పడగా స్థానికులు వెంటనే రిమ్స్‌కు తరలించారు. డాక్టర్లు పరిశీలించగా అప్పటికే చనిపోయారని నిర్ధారించారు.

వరద బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-బోథ్

మండలంలో మర్లపల్లి గ్రామంలోని పలువురికి అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ బాధితులందరికి రూ.20 వేలతో పాటు ఇంటిపై కప్పు కొరకు టార్పలిన్ కవర్‌ల కోసం రూ.10వేలను అందించారు. రెండు రోజుల నుంచి వర్షంతో ఇండ్లలోకి వరద నీరు చేరి ఇబ్బందులు పడుతున్న వారిని కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే భారీ వర్షం తో నష్టపోయిన వారికి సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. అలాగే భారీ వర్షంతో రైతులు పంటలు బాగా నష్టం వాటిల్లిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కృషి చేస్తానని అన్నారు.

అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు

నవతెలంగాణ - జైనూర్

భారీ వర్షాల వల్ల ప్రజలు అత్యవసరమైతేనే బయటకు రావాలని సిర్పూర్(యు) ఎస్ఐ రాజు అన్నారు. శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. భారీ వర్షాల కారణంగా నీటి ప్రవాహంతో కాలువ, కల్వర్టులు దాటి ప్రమాదానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యుత్ స్తంభాలు, పడిపోయిన విద్యుత్ వైర్లను తాకకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. చెట్ల కింద, పాత గోడలకు, కొత్త దారిలో వెళ్లకుండా ఎప్పుడు వెళ్లే దారిలో మాత్రమే వెళ్లాలని కోరారు. పిల్లలు ఆడుకోవడానికి వర్షపు నీటిలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.


అధిక వర్షాల పట్ల జాగ్రత్తలు పాటించాలి

నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాల పట్ల రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి రామక్రిష్ణ సూచించారు. శుక్రవారం మండలంలోని రాస్పెల్లి, సార్సాల గ్రామాల్లో రైతు పంట భూములను పరిశీలించి పలు సూచనలు చేశారు. పత్తి పంటల సాళ్ళ మధ్య నీరు నిలవకుండా బయటకు పోయేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అధిక వర్షాలతో పత్తి మొక్కలు పసుపు రంగుకి మారే అవకాశం ఉందని, మొక్క వయసును బట్టి 10 గ్రాముల పోటాషియం నైట్రేట్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. పంట ఎదుగుదలను పెంచడానికి వర్షాలు తగ్గిన వెంటనే 25 కిలోల యూరియా 10 కిలోల పోటాష్ ఎరువును మొక్కకు ఐదు సెంటిమీటర్ల దూరంలో వేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణం : ఎస్పీ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఇటీవలే బదిలీ అయిన ఇద్దరు రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ల వీడ్కోలు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ డి.ఉదయ్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న బదిలీ ప్రక్రియలో భాగంగా అదిలాబాద్ జిల్లా హెడ్ క్వార్టర్‌కి చెందిన గడికొప్పుల వేణు, ఏం.వంశీకృష్ణ, ఇద్దరు రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు జిల్లా నుండి జగిత్యాల, హైదరాబాద్‌లకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ పాల్గొని, సిబ్బందితో మాట్లాడుతూ ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగికి స్థానచలనం సర్వసాధారణమని పేర్కొన్నారు. ఇరువురు అధికారులను సిబ్బంది సమక్షంలో పూలమాల శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సమాజంలో పోలీస్ శాఖది ప్రత్యేక స్థానమని తెలిపారు. ప్రతి ఒక్క సమస్యను పూర్తి చేయాలంటే సరైన పద్ధతి, సరైన సమయంలో సరైన విధానంలో పనిచేయాలని సూచించారు. రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ గడికోప్పుల వేణు మొదటగా జిల్లాలో రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ అడ్మిన్ ఆర్ఐగా, డీటీసీలో విధులు నిర్వహించారు. హెడ్ క్వాటర్స్‌లో అదేవిధంగా జిల్లా శిక్షణ కేంద్రంలో విధులు నిర్వహించి జిల్లా పోలీసు వ్యవస్థ పేరును ఉన్నత శిఖరాలను అధిరోహించేలా సేవల నిర్వర్తించారని కొనియాడారు. ఈ వీడ్కోలు సభలో అధికారులు అదనపు ఎస్పీ ఎస్ శ్రీనివాసరావు, డీఎస్పీలు వి.ఉమేందర్, పోతారం శ్రీనివాస్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు, సబ్ ఇన్స్‌పెక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఉట్నూర్

ఉట్నూర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంగ్లీష్-3, తెలుగు-2, బాటని-2, హిస్టరీ-2, పొలిటికల్ సైన్స్-2, కామర్స్-2, కంప్యూటర్ సైన్స్-3, ఎకనామిక్స్-2, జువాలజీ-1, గెస్ట్ ఫ్యాకల్టీ ఖాళీలు ఉన్నాయని, అర్హత గల అభ్యర్థులు సంబంధిత పీజీలో కనీసం 55శాతం మార్కులు కలిగి ఉండాలని, నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. బోధన అనుభవం ఉన్న అభ్యర్థులు సంబంధిత ధృవపత్రం సమర్పిస్తే వెయిటేజీ ఉంటుందని, అర్హులైన అభ్యర్థులు తగిన ధృవపత్రాలతో ఈ నెల 23వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తులు అందించాలని అన్నారు. 24వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆదిలాబాద్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించబడుతాయని అన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

వరద బాధితులకు సాయం

నవతెలంగాణ-బోథ్

మండలంలోని మర్లపల్లి గ్రామంలో భారీ వర్షంతో 36ఇండ్లలోకి వరదనీరు చేరింది. ఈ వరద బాధితులకు శుక్రవారం కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ అతికొద్దీన్ ఒక్కొక్కరికి రూ.2వేలు, 29కిలోల బియ్యాన్ని అందజేశారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రాథోడ్ ప్రకాష్, సీనియర్ అసిస్టెంట్ శ్యాంసుందర్‌రెడ్డి, ఆర్ఐ దశరథ్, స్థానిక సర్పంచ్ కల్లూరి దేవేందర్, డీలర్ సీతారాం పాల్గొన్నారు.

జీఎన్ఆర్ కాలనీలో పర్యటించిన మున్సిపల్ చైర్మెన్

నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో శుక్రవారం పట్టణంలోని సిద్దాపూర్ సమీపంలోని జీఎన్ఆర్ కాలనీలో మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ పర్యటించారు. సిద్దాపూర్ వాగులో వరద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లా కేంద్రంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సూచనలు, సలహాలతో, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా జీఎన్ఆర్ కాలనీతో పాటు, పట్టణంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. సారంగాపూర్ మండలంలోని స్వర్ణ జలాశయం ఎగువ మహారాష్ట్ర నుంచి భారీ వరదనీరు వస్తోందని అన్నారు. సిద్దాపూర్ కాలనీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి సమస్యలు ఉన్న పురపాలక సంఘం కార్యాలయంలో 24 గంటలు సేవలు అందించేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసామని సిబ్బంది అందుబాటులో ఉంటారని అన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ 7993396793కు లేదా స్వయంగా చైర్మెన్ నెంబర్‌కి కాల్ చేసి సమాచారాన్ని అందించాలని కోరారు. అత్యవసర పరిస్థితిలో తప్ప ఎవరూ కూడా బయటకి రావద్దని సూచించారు. విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు వాటికి దూరంగా ఉండాలన్నారు. చైర్మెన్ వెంట స్థానిక కౌన్సిలర్ అన్వర్ పాషా, కాలనీవాసులు ఉన్నారు.

వర్షంతో నష్టపోయిన కుటుంబాలకు ఆర్థిక సాయం



నవతెలంగాణ-బోథ్

మండలంలోని మర్లపల్లి గ్రామంలోని గత మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి ఇండ్లలో వరదనీటి రావడంతో కుటుంబాలకు ఎంపీపీ తుల శ్రీనివాస్ ఆర్థిక సాయం కింద రూ.30వేలను అందజేశారు. అలాగే మాట్లాడుతూ మారుమూల ఆదివాసీ గిరిజన గ్రామాలను భారీ వర్షంలో పర్యటించి తక్షణ సహాయం కింద ఎస్‌కే బాబు, ఆకాష్, కరాడి మారుతి, ఎస్‌కే కుదాన్, నారాయణశెట్టి సాయి, ఎస్‌కే సత్తార్, కుటుంబాలకు తక్షణ సాయం అందించారు. అలాగే దాదాపు 1000 ఎకరాల వరకు పంట నష్టం జరిగినందున వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళతానని హామీ ఇచ్చారు. నష్టాన్ని వివరించారు. తక్షణమే జిల్లా అధికారులను గ్రామానికి పంపించి నష్టాన్ని అంచనా వేసి వెంటనే నష్టపరిహారాన్ని అందజేయాలని కోరుతామని అన్నారు. అలాగే నక్కలవాడ గ్రామం దగ్గర బ్రిడ్జిని సందర్శించి త్వరలోనే నిర్మాణం చేపట్టేలా ఉన్నతాధికారులతో మాట్లాడతానని భరోసా కల్పించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గ్రామాన్ని సందర్శించి, ఆర్థిక సాయం చేసినందుకు ఎంపీపీకి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్‌రెడ్డి, మహిపాల్, ఎంపీటీసీ, దేవేందర్, బాబు సింగ్, గ్రామస్తులు బాధితులు పాల్గొన్నారు.

కడెం పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-కడెం

కడెం ప్రాజెక్టు పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని శుక్రవారం కడెం ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులు పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా గత 4 రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కడెం ప్రాజెక్టుకు భారీగా వరద ప్రవాహం కొనసాగుతుంది. దీంతో అప్రమత్తమైన ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టు పరివాహ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రవాహ ప్రాంతాలకు ఎవరు కూడా బయటకు వెళ్లకూడదని అధికారులు సూచించారు. గురువారం రాత్రి నుండి ప్రాజెక్టుకు లోనికి వచ్చే వరద ప్రవాహాన్ని ఇన్‌ఫ్లో నీటిని దృష్టిలో ఉంచుకొని ఎప్పటికప్పుడు గేట్ల ద్వారా నీటిని గోదావరిలోనికి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు ఉదయం భారీ వరద ప్రవాహం చేరడంతో కడెం ప్రాజెక్టుకు మళ్లీ ముంపు ఏర్పడగా మండల ప్రజల్లో భయం మొదలైంది. ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో గత సంవత్సరం వరదలు మరవకముందే మళ్లీ ఈ సంవత్సరం ప్రాజెక్టుకు వరదలు పోటెత్తడంతో ఏం జరుగుతుందో తెలియలేని పరిస్థితి ఉందన్నారు. 10 గంటలకు కడెం ప్రాజెక్టుకు 1,86,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నీరు చేరగా ప్రాజెక్ట్ 11 వరద గేట్లు ఎత్తి దిగువకు 1,36,200 క్యూసెక్కుల వరద నీటిని దిగువనున్న గోదావరిలోకి అధికారులు వదిలారు. కడెం ప్రాజెక్టు మరమ్మతులు అసంపూర్తిగా చేయడంతో కడెం ప్రాజెక్టు గేట్లు పది మాత్రమే నూతన టెక్నాలజీతో ఎత్తగా మిగత గేట్లలో నాలుగేట్లను కడెం యువత తమ ధైర్య సహకారాలతో మాన్యువల్‌గా నాలుగు గేట్లను ఎత్తారు. ఈ నాలుగు గేట్లను ఎత్తడం వలన కడెం ప్రాజెక్టుకి ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షానికి వచ్చే ఇన్‌ఫ్లో 1,53,800 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోనికి చేరగా, ప్రాజెక్టు నుంచి 14 వరద గేట్ల ద్వారా నీటిని 1,58,800 క్యూసెక్కుల నీటిని గోదావరి లోనికి విడుదల చేశారు. ఎగువ ప్రాంతంలలో వర్షం తగ్గడంతో ప్రాజెక్టు ఇన్‌ఫ్లో వాటర్ తగ్గడంతో కడెం ప్రాజెక్టు పెను ప్రమాదం తప్పిందని అన్నారు. కడెం ప్రాజెటక్టుకు మొత్తం 18 గేట్లు ఉండగా, గత సంవత్సరం భారీ వర్షాలు కురవడంతో ప్రాజెక్టుకు అధిక మొత్తంలో వరదప్రాహం చేరడంతో ప్రాజెక్టు గేట్లు దెబ్బ తినడంతో గత సంవత్సరం ప్రాజెక్టు మరమ్మతులో నిమిత్తం స్వప్న కన్‌స్ట్రక్షన్ వారికి కాంట్రాక్ట్ ఇచ్చారు. ప్రాజెక్టు మరమ్మతుల్లో నిర్లక్ష్యం వహించడం పట్ల ప్రజలు అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నేతకాని మహర్ రాజకీయ చైతన్య యాత్రను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-దస్తురాబాద్

నేతకాని మహర్ జనాభా ప్రకారం రావాల్సినటువంటి హక్కుల సాధన కోసం రాజకీయ చైతన్య యాత్ర నిర్వహిస్తున్నామని నేతకాని మహర్ సంఘం మండల అధ్యక్షులు రత్నాల తిరుపతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో తమకు రావాల్సిన రాజ్యాంగ హక్కులైనటువంటి దళితబంధు, దళితబస్తి, డబుల్ బెడ్ రూమ్, జనాభా ప్రకారం ఎమ్మెల్యే, ఎంపీ సీట్లు ఇవ్వాలని కోరుతూ రాజకీయ చైతన్య యాత్ర పోస్టర్ విడుదల చేశారు. రాజ్యాంగం వచ్చి 70 సంవత్సరాలు దాటిన నేతకాని మహర్ సమాజం జీవితాలు మారలేదని అన్నారు. రాజ్యాంగ ఫలాలు ఆమడ దూరంలో ఉన్నాయని అన్నారు. విద్యా ఆర్థిక రాజకీయ రంగంలో ముందుకెళ్లట కోసం ఈ ప్రభుత్వాలు కృషి చేయాలని పిలుపునిస్తూ, ఈనెల 23న జన్నారం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేయనున్న నేతకాని మహా రాజకీయ చైతన్య యాత్రను జయప్రదం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నేతకాని సంఘం గౌరవాధ్యక్షులు శైలేందర్, ప్రధాన కార్యదర్శి దుర్గం పోషలింగం, మండల ఉపాధ్యక్షులు మునేసుల రాజన్న, రత్నాల నర్సయ్య, జాడి గోపి, నాయకులు లింగన్న, బోర్లకుంట కిషన్ పాల్గొన్నారు.